మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజిలు - 8
సంచిక : 34 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



పండుగ సందర్భంగా నేడు మా ప్రధాన కార్యాలయానికి సెలవు. కావున రేపటి సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం..




# కొడంగల్‌పై కుట్రలు జరుగుతున్నాయి

- నన్ను కిందపడేయాలని చూస్తున్నారు
- కొడంగల్‌కు ఎవరూ చేయని అభివృద్ధి చేశా
- 4 వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టును తీసుకొచ్చా
- కొడంగల్ ను అభివృద్ధి చేయనీయొద్దని డీకే అరుణ కుట్ర
- అసలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించాలి?
- ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా?
- రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా?
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా?
- ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా?
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- మండలాల వారీగా కాంగ్రెస్ నేతలతో సీఎం సమీక్ష
- భారీ మెజార్టీయే లక్ష్యంగా దిశానిర్దేశం

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు): కొడంగల్‌లో తనని కింద పడేయాలని కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని.. 75 ఏళ్లలో కొడంగల్‌కు ఎవరూ చేయని అభివృద్ధి చేశానన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కొడంగల్ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం సాయంత్రం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కొడంగల్‌కు తాను మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్, వెటర్నరీ కాలేజ్ తీసుకొచ్చానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరువు ప్రాంతంగా ఉన్న కొడంగల్ ప్రాంతాన్ని 4 వేల కోట్ల రూపాయలతో నారాయణపేట్- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకొచ్చానని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చారా అని బీజేపీ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను సీఎం ప్రశ్నించారు. కొడంగల్ ను అభివృద్ధి చేయనీయొద్దని డీకే అరుణ కుట్ర చేస్తున్నారన్నారు."అసలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించాలి. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా? రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా? ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా?" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.పదేండ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్ లో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్రూం ఇచ్చిందా అని సీఎం ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని స్పష్టం చేశారు.ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారని.. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోదీ ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోదీ మళ్లీ ఓటేస్తే చంద్రమండలానికి రాజవుతారా అని మండిపడ్డారు."మనల్ని దెబ్బ తీయడానికి పన్నాగాలు పన్నుతున్నారు.

మిగతా 2లో..



## సీఎం రేవంత్‌కు తప్పిన ముప్పు

### - కాన్వాయ్‌లో పేలిన టైరు

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రమాదం తప్పింది. రేవంత్ కాన్వాయ్‌లోని ల్యాండ్ క్రూజర్ కారు టైర్ పంక్చర్ అయి ఒక్కసారిగా పేలింది. దీంతో కారు సడెన్‌గా ఆగిపోయింది. హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళ్లే సమయంలో వికారాబాద్ జిల్లా మన్నెగూడా వద్ద ఈ ఘటన జరిగింది. టైర్ పేలడంతో అందరూ భయంతో ఉలిక్కిపడ్డారు. వెంటనే వాహనాల నుంచి బయటకు వచ్చారు. కాన్వాయ్‌లో వెళ్తున్న నాయకులకు ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పేలిన టైర్లు రిపేర్ చేయడంతో మళ్లీ కొడంగల్‌కు బయలు దేరారు.గతేడాది

మిగతా 2లో..


## ప్రజల ఆశలు,ఆకాంక్షలు నెరవేరాలి

### - సీఎం రేవంత్ ఉగాది పండుగ శుభాకాంక్షలు

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు): రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ప్రజల ఆశలు ఆకాంక్షలన్నీ నెరవేరాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, రైతుల రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. నూతన సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

## యువతకోసం కొత్త చట్టం తీసుకొస్తాం..!

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
### నిరుద్యోగ యువతకు రాహుల్ గాంధీ హామీ



సియో, (ప్రజామంటలు): ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో పర్యటించారు.

మిగతా 2లో..

## కాంగ్రెస్‌కు పేదలంటే పట్టదు

- ఆ పార్టీ హక్కులను హరిస్తోంది
- గత పదేళ్లలో దేశం దూసుకుపోతోంది
- చత్తీస్‌గఢ్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ



చత్తీస్‌గఢ్ (ప్రజామంటలు): మావోయిస్టుల కంచుకోట బస్తరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రధాని నరేంద్ర మోదీ. చత్తీస్‌గడ్‌లో గతంలో అధికారంలో ఉన్న

మిగతా 2లో..



## బీజేపీ పాలనలో మీడియా స్వేచ్ఛ కనుమరుగైంది

### - కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపణ

కేరళ, (ప్రజా మంటలు): బీజేపీ పాలనలో మీడియా స్వేచ్ఛ కనుమరుగైందని, వారి పాలనను కీర్తించని సంస్థలను.. సంఘ్ పరివార్ నిర్దాక్షిణ్యంగా టార్గెట్ చేస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ఆరోపించారు. బీబీసీకి చెందిన ఇండియన్ న్యూస్‌రూమ్ కార్యకలాపాలను నిలిపివేసినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. యుకె ఆధారిత బీబీసీ ఇటీవల భారతదేశంలో తన కార్యకలాపాలను దేశంలోని విదేశీ పెట్టుబడి నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మించింది. మీడియాను ఉద్దేశించి విజయన్ మాట్లాడుతూ, ఆదాయపు పన్ను శాఖ నిరంతర

మిగతా 2లో..

## ఎమ్మెల్యే కవితకు మధ్యంతర బెయిల్‌కు కోర్టు 'నో'



న్యూఢిల్లీ, (ప్రజామంటలు): ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను రౌస్ అవెన్యూ తిరస్కరించింది. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ ను కొట్టేసింది. చిన్న కుమారుడికి పరీక్షలు ఉన్నందున ఈ నెల 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏప్రిల్ 4న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా, బెయిల్ పిటిషన్ కొట్టేస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. సీబీఐ స్పెషల్ కోర్ట్ జడ్జి కావేరి భవేజా కవితకు బెయిల్ నిరాకరిస్తూ తీర్పును వెలువరించారు. ఏప్రిల్ 4న కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం.. మహిళగా, ఎమ్మెల్సీగా ఉన్నందున.. ముఖ్యంగా తన చిన్న కుమారుడుకి 11వ తరగతి పరీక్షలు ఉన్నందున ఏప్రిల్ 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు.

మిగతా 2లో..

## బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావం


- 13 నుంచి జిల్లాల్లో కేసీఆర్ బస్సుయాత్ర
- చేవెళ్ల నుంచి ప్రచారం ప్రారంభం



హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13 నుంచి ఆయన ప్రజల్లోకి రానున్నారు. ఆ రోజు చేవెళ్ల బహిరంగ సభలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. బహిరంగ సభల కంటే బస్సు యాత్రల వైపే గులాబీ బాస్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి బస్సు యాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్

మిగతా 2లో..

## ప్రజా నాడి




## తెలంగాణలో బిజేపికి అనుకూలంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు

### ఎన్నికల కోసమే లిక్కర్ కేసులో కవిత బెయిల్ నిరాకరణా? - అభ్యర్థుల ఎంపికలో బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్యం?

హైదరాబాద్ ఏప్రిల్ (ప్రజా మంటలు ప్రత్యేక ప్రతినిధి) : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, నిన్నటి వరకు అధికారంలో ఉన్న భారతీయ రాష్ట్ర సమితి వచ్చే నెలలో ఉన్న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తమ అభ్యర్థుల ఎంపికలో బిజేపికి అనుకూలంగా, వీలైనన్ని సీట్లు బిజేపి గెలవడానికి వీలుగా బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టినట్టు ప్రచారం జరుగుతుంది. అనుకోకుండా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో కనీసం 12-14 స్థానాలు గెలుచుకోవాలనే లక్ష్యం పెట్టుకొన్నట్లు కాంగ్రెస్ నాయకులు చెపుతున్నా, అందుకు విరుద్ధంగా, చాలా స్థానాల్లో బలహీనమైన అభ్యర్థుల ఎంపిక చేసినట్లు ఆ పార్టీలోని వర్గాలే చెపుతున్నారు. కాంగ్రెస్ లో బలమైన అభ్యర్థులు లేనట్లు భారతీయ రాష్ట్ర సమితి నుండి అరువు తెచ్చుకొని, చేవెళ్ళ, మల్కాజిగిరి, సికింద్రాబాద్, మెదక్, వరంగల్ స్థానాల్లో వాలసవాదులకు టిక్కట్లు ఇచ్చింది. చేవెళ్ళ అభ్యర్థి రంజిత్ రెడ్డి, చేవెళ్ల లో పట్నం సునిత రెడ్డి, భారతీయ రాష్ట్ర సమితి తమ అభ్యర్థులుగా ప్రకటించనున్నట్లు నిర్ణయించిన తరువాత, మరీ ముఖ్యంగా, వరంగల్ లో కడియం కావ్యను అభ్యర్థిగా ప్రకటించిన తరువాత వారిని కాంగ్రెస్ లో చేర్చుకొని, అక్కడి నాయకులకు, కార్యకర్తలకు షాక్ ఇస్తూ, రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని కాంగ్రెస్ వర్గాలే ఆశ్చర్యానికి గురిచేసింది.

> దేశమంతా బిజేపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ కూటమి ఏర్పాటు చేసుకొని, అధికారంలోకి రావడానికి నిర్విరామగా కృషి చేస్తుంటే, తెలంగాణలో అందుకు వ్యతిరేకంగా, బిజేపి కి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు, బలహీనమైన అభ్యర్థులను పార్లమెంట్ స్థానాలలో నిలిపినట్లు జరుగుతున్నప్రచారం పట్ల కాంగ్రెస్ నాయకత్వం మేల్కొనయకపోతే నష్టం అనివార్యం.



### అంతటా వలసవాదులకే దక్కిన ప్రాధాన్యత ?

మెదక్ స్థానంలో ఒక గ్రామ స్థాయి నాయకుని, గత ఎన్నికల్లో పఠాన్ చెరువు కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించడానికి కృషి చేసిన నీలం మధుకు టిక్కట్టు ఇవ్వడం వెనుక ఉన్న రాజకీయాలనుకాంగ్రెస్ నాయకులు, అభిమానులు అర్థం చేసుకోలేక చిటికీలపడిపోయారు. మెదక్ నుండి బిజేపి అభ్యర్థి రఘునందన రావు పోటీ చేస్తున్నారు. భారతీయ రాష్ట్ర సమితి నుండి ప్రముఖ బిల్డర్, మాజీ కలెక్టర్ వేంకటరామ రెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు కొత్త అయిన వేంకటరామ రెడ్డిని చివరి నిమిషంలో ఎంపిక చేయడం, డానికి అనుకూలంగానే నీలం మధును కాంగ్రెస్ ఎంపిక చేయడం అంతా చూస్తుంటే, పరోక్షంగా ఈ రెండు పార్టీలు బిజేపి అభ్యర్థిని గెలిపించడానికే కంకణం కట్టుకున్నాయా

మిగతా3లో..

మొదటి పేజీ తరువాయి

# ఎమ్మెల్యే కవితకు మధ్యంతర బెయిల్‌కు కోర్టు'నో'

ఈ మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. అయితే కవిత చిన్నకొడుకు ఒంటరిగా ఏం లేడు. 22 ఏళ్ల సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు తోడుగా ఉన్నాడు. కవితను ఆమె ముగ్గురు సిస్టర్స్ ములాఖత్ అయ్యారు. అబ్బాయి చూసుకోవాడానికి కుటుంబ సభ్యులు ఉన్నారు. పరీక్షలు ఉన్నాయని మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు, కానీ పరీక్షల్లో కొన్ని ఇప్పటికే అయిపోయాయి. కవిత కుమారుడికి ఎగ్జామ్ యాం÷-జగైటీ ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదు అని ఈడీ తరపు న్యాయవాది తెలిపారు. కవితకు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నాయి. లిక్కర్ కేసు ఎ÷-లాన్ చేసింది కవిత. కవిత మొబైల్ ఫోన్లను మార్చారు. ఆధారాలు ధ్వంసం చేశారు. ఫోన్లలో సమాచారాన్ని డిలీట్ చేశారు. 9 ఫోన్లలో డేటా డిలీట్ చేశారు. మొత్తం 10 ఫోన్లను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపాం. 9 ఫోన్లను ఫార్మాట్ చేశారు. లిక్కర్ కేసులో కవిత పాత్రపై దర్యాప్తు కొనసాగు తుంది. కవిత బ్యాంకు ఖాతాలు, ఐటీఆర్ వివరాలు,కుటుంబ వ్యాపార వివరాలు ఇవ్వలేదు. ఫోరెన్సిక్ లాబ్ డేటా ప్రకారం 4 ఫోన్లు ఫార్మాట్ చేయబడ్డాయి. ఈ కేసులో వందల కొద్దీ డిజిటల్ పరికరాల్లో డేటా డిలీట్ చేయబడింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉంది.. ఈ సమయంలో కవితకు బెయిల్ ఇవ్వడం కేసు దర్యాప్తుకు ఆటంకం కలుగుతుంది. లిక్కర్ వ్యాపారంలో కవిత వాటా 33 శాతం. మాగుంట రాఘవరెడ్డి వాటా 33 శాతం. దినేష్ అరోరా అప్రూవర్ మారాకా అన్ని విషయాలు చెప్పాడు. వంద కోట్ల రూపాయలు కవిత ఆలోచన మేరకే ఆమ్ ఆద్మీ పార్టీకి ముడుపుల రూపంలో ఇచ్చారు. బుచ్చిబాబు ఫోన్ నుంచి డేటా రికవరీ చేశాము. ఆ డేటా ఆధారంగా కవితను విచారించాము. అరుణ్ పిళ్ళైతో కవితను విచారించాము. అప్రూవల్‌గా మారిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ కవిత బెదిరించారు' అని న్యాయవాది జోయబ్ హోస్సేన్ వెల్లడించారు. కవితకు వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలను జడ్జికి సమర్పించారు. అలాగే కవితకు బెయిల్ ఇవ్వాలన్న వాదనను తిరస్కరించాలని కోర్టును ఈడీ తరపు న్యాయవాది జోయబ్ హోస్సేన్ కోరారు. ఈడీ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం కవితకు బెయిల్‌ను నిరాకరించింది.

# సీఎం రేవంత్‌కు తప్పిన ముప్పు

**- కాన్వాయ్‌లో పేలిన టైరు**

మార్చిలోనూ రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రాజన్న సిరిసిల్ల జిల్లా రావుపేటలో రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు.. అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి కాన్వాయ్‌లో ముందున్న కారును ఢీకొట్టింది. దీంతో వరుసగా ఆరు కార్లు ఒకదానికి ఒకటి గుద్దుకున్నాయి. అయితే ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. మొత్తం ఏడు కార్లు ధ్వంసమ య్యాయి. కాగా సీఎం రేవంత్ సోమవారం కొండగల్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలతో లోక్ సభ ఎన్నికలపై సన్నాహక సమానేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలపై దిశానిర్ధేశర చేశారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ మహబూబ్‌నగర్ పరిధిలోనే ఉండటంతో.. ప్రత్యేక దృష్టి చెప్పారు సీఎం.

# కొడంగల్‌పై కుట్రలు జరుగుతున్నాయి



ఇది రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం కాదు.. కొడంగల్ అభివృద్ధిని దెబ్బతీయడం. నేను ఎక్కడున్నా నా గుండె చప్పుడు కొడంగల్ మాత్రమే. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం. నాతో కొట్లాడే హక్కు మీకుంది. పట్టు పట్టి పని చేయించుకునే అధికారం మీకుంది. రాష్ట్రానికే నాయకత్వం వహించే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్ నుంచి 50వేల మెజారిటీ అందించాలి. కొడంగల్ పై జరిగే కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలి." అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను 14 సీట్లలో గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అందుకు తగ్గట్టుగానే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీ నేతలకు, శ్రేణులకు కీలక సూచనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటుపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ మహబూబ్‌నగర్ పరిధిలోనే ఉండటంతో.. కొడంగల్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తీసుకురావడంపై దృష్టి సారించారు. సోమవారం (ఏప్రిల్ 8) మండలాలవారీగా కాంగ్రెస్ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్నారు. నేతలకు, కార్యకర్తలకు ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలపై దిశానిర్ధేశం చేశారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇక బీజేపీ తరపున మాజీమంత్రి డీకే అరుణ బరిలో ఉన్నారు. కచ్చితంగా ఈసారి ఎంపీగా గెలవాలని భావిస్తున్న డీకే అరుణ.. ఇందుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ తరపున సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి మరోసారి ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. మూడు పార్టీలకు మహబూబ్‌నగర్‌లో పట్టు ఉండటంతో.. ఇక్కడ త్రిముఖ పోటీ ఉండొచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధించడంపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి పెట్టారు.

### బీజేపీ పాలనలో మీడియా స్వేచ్ఛ

# కనుమరుగైంది

**- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపణ**

ప్రతీకార చర్యల కారణంగా బీబీసీ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని నివేదికలు పేర్కొన్నాయి. "బీజేపీ పాలనలో మీడియా స్వేచ్ఛ కనుమరుగైంది, పాలనను కీర్తించని మీడియా సంస్థలను సంఘ్ పరివార్ నిర్ధాక్షిణ్యంగా లక్ష్యంగా చేసుకుంటోంది." అని విజయన్ అన్నారు. నిరంకుశ పాలనలు ఎల్లప్పుడూ మీడియాను నియంత్రించడానికి ప్రయత్నిస్తాయని, భారతదేశంలోని ఎమర్జెన్సీ యుగాన్ని గుర్తుకు తెచ్చే లక్షణాలు బీజేపీ పాలనలో మళ్లీ పుంజుకుంటున్నాయని ఆయన అన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ ర్యాంకింగ్ క్రమంగా క్షీణిస్తోందన్నారు. "పారిస్‌కు చెందిన రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ 2023 నివేదిక ప్రకారం, 180 దేశాలలో భారతదేశం పత్రికా స్వేచ్ఛ ర్యాంకింగ్ 150 నుంచి 161కి పడిపోయింది" అని సీనియర్ లెఫ్ట్ నాయకుడు చెప్పారు. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా రిపోర్టు చేసే సాహసం చేసే జర్నలిస్టులపై కనికరం లేకుండా దాడులు చేయడాన్ని దేశం చూస్తోందన్నారు. ఢిల్లీ అల్లర్ల కవరేజీపై కేరళలోని రెండు వార్తా సంస్థల లైసెన్స్‌లను రద్దు చేసిన 2020 ఘటనను కూడా విజయన్ ప్రస్తావించారు. కేరళలో ఒకే దశ లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 26న జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# కాంగ్రెస్‌కు పేదలంటే పట్టదు


- ఆ పార్టీ హక్కులను హరిస్తోంది
- గత పదేళ్లలో దేశం దూసుకుపోతోంది
- ఛత్తీస్‌గఢ్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ



కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొమ్మును లూటీ చేసిందని ఆరోపించారు మోదీ. తాను అవినీతిపై యుద్ధం ప్రకటిస్తే విపక్షాలు మోదీ గ్యారంటీలపై విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా అవినీతిని అంతం చేస్తానని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన విజయ్ సంకల్ప్ శంఖనాద్ మహారాలీలో ప్రసంగించిన ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. పేదల గురించి కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలు పేదల హక్కులను లాక్కున్నారని ఆరోపించారు. పేదలకు హక్కులు కల్పించి సగౌర్వంగా జీవించేలా చేశామన్నారు. ప్రస్తుతం దేశం మొత్తం మరోసారి మోదీ సర్కార్ అంటున్నారు. దేశంలోని ప్రతి పేదవాడికి నేను అండగా ఉంటానని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.. బీజేపీ ప్రభుత్వం పేదల కోసం ఒక్కొక్కటిగా పథకాలు తీసుకువచ్చి వారి హక్కులను కల్పించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి ఫలితంగానే దేశంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. పేదవారి ప్రతి ఆందోళనను తొలగించే వరకు విశ్రమించనని నిర్ణయించుకున్నానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభించామన్నారు. ఆయుష్మాన్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. దశాబ్దాల తర్వాత దేశం సుస్థిరమైన, బలమైన బీజేపీ ప్రభుత్వాన్ని చూసిందని ప్రధాని మోదీ అన్నారు. పేదల సంక్షేమమే మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. స్వాతంత్ర్యానంతరం పేదల అవసరాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు దశాబ్దాలుగా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదల గురించి పట్టించుకోలేదు, వారి సమస్యలను అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ కుటుంబంలోని ధనవంతులకు ద్రవ్యోల్బణం అంటే అర్థం కాలేదన్నార ప్రధాని మోదీ. పేదలకు ఉచితంగా రేషన్, వ్యాక్సిన్ ఇచ్చామని ప్రధాని మోదీ అన్నారు. కరోనా కాలాన్ని ప్రస్తావిస్తూ, ప్రధాని మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రజలు భారతదేశం ఎలా మనుగడ సాగిస్తుందని చెప్పేవారు? కాంగ్రెస్ హయాంలో దేశంలో వ్యాక్సిన్ రావడానికి దశాబ్దాలు పట్టేది. భారత దేశంలోని ప్రతి పేదవాడికి అండగా ఉంటానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. పేదలకు ఉచితంగా వ్యాక్సిన్, ఉచితంగా రేషన్ ఇచ్చామని గుర్తు చేశారు.2014కి ముందు లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఢిల్లీ నుంచి ఒక్క రూపాయి వస్తే, అదీ గ్రామాలకు 15 పైసలు మాత్రమే వచ్చేవి. మిగిలిన 85 పైసలను కాంగ్రెస్ వారే కొల్లగొట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ దోచుకునే ఈ వ్యవస్థను ఆపానని స్పష్టం చేశారు మోదీ. అవినీతిపరుల నల్లధనాన్ని అడ్డుకున్నానని, . బీజేపీ ప్రభుత్వం తన పదేళ్లలో రూ.34 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పంపించినట్లు ప్రధాని మోదీ తెలిపారు.

## యువతకోసం కొత్త చట్టం

# తీసుకొస్తాం..!



ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల మహిళల ఖాతాల్లోకి ఏటా లక్ష రూపాయలను జమ చేస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. ఇదిలా ఉంటే.. లోక్ సభ ఎన్నికల్లో మండల స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తేపై కాంగ్రెస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఓంకార్‌సింగ్ మార్కమ్‌ను బరిలోకి దింపింది. ఈ క్రమంలో.. సియోని జిల్లాలోని ధనోరాలో రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు గ్యారెంటీ అప్రెంటీస్‌షిప్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. తమ మేనిఫెస్టోలో మూడు నాలుగు విప్లవాత్మకమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు, వెనుకబడిన తరగతులు, పేద కుటుంబాలకు చెందిన మహిళల బ్యాంకు ఖాతాలకు లక్ష రూపాయలను బదిలీ చేయడం వంటివి. ఈ విధంగా తాము ప్రతి నెలా మీ ఖాతాలకు వేల రూపాయలు పంపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా.. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు చెల్లించే మొత్తాన్ని రెట్టింపు చేస్తామని మేనిఫెస్టోలో ఉంచామని రాహుల్ గాంధీ చెప్పారు.నిరుద్యోగ యువతకు రాహుల్ గాంధీ హామీల వర్షం కురిపించారు. దేశంలోని ప్రతి నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగంలో ఒక సంవత్సరం అప్రెంటిస్‌షిప్ పొందేలా తాము కొత్త చట్టాన్ని కూడా తీసుకువస్తామని తెలిపారు. ఆ సమయంలో వారికి జీతభత్యం అందిస్తామన్నారు. శిక్షణ పూర్తయ్యాక మంచి పనితీరు కనబరిస్తే అదే చోట ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. మరోవైపు.. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఉద్యోగాల్లో కాంట్రాక్టు వ్యవస్థకు స్వస్తి పలికి, ప్రభుత్వ రంగంలోని 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అంతేకాకుండా.. రైతులు తమ పంటలకు సరిపడా ఎంఎస్‌పి వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేస్తుందని, దీని కోసం వారు చాలా కాలంగా ఉద్యమిస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు.. ఆదివాసీలను తమ భూమి నుంచి నిర్మూలించి.. నీరు, అడవి, భూమిపై వారి మొదటి హక్కులను లాగేసుకోవడమే లక్ష్యంగా బీజేపీ ఉద్దేశపూర్వకంగా వారిని 'ఆదివాసీలు' అని కాకుండా 'అటవీవాసులు' అని పిలుస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావం

- 13 నుంచి జిల్లాల్లో కేసీఆర్ బస్సుయాత్ర
- చేవెళ్ల నుంచి ప్రచారం ప్రారంభం

పాల్గొననున్నట్లు సమాచారం. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచే బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల 13న కేసీఆర్ చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎండిన పంటలను పరిశీలించాలని కేసీఆర్ ఇటీవల పొలంబాట పట్టారు. అందులో భాగంగా ఈ నెల 5న కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. పలు నియోజకవర్గాల్లో ఎండిన పంటలు పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులు ధైర్యంగా ఉండాలని.. బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలువురు రైతులు ఆయనకు సమస్యలు ఏకరువు పెట్టారు. సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గులాబీ బాస్ దృష్టికి తెచ్చారు. మంచినీళ్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కొందరు చెప్పారు. దీనిపై స్పందించిన కేసీఆర్.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జనగామసూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించారు. తెలంగాణలో అన్నదాతలు మళ్లీ ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని అనుకోలేదని.. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అంతా ఆలోచించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. పంటలు పరిశీలించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ 100 రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న తెలంగాణకు స్వల్ప కాలంలోనే ఈ దుస్థితి ఎందుకు రావాలి.?. సాగునీళ్లు ఇస్తారని నమ్మి రైతులు పంటలు వేసుకున్నారని.. ముందే చెబితే వేసుకునే వాళ్లం కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇంత కష్టకాలం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు.' అని కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ ట్యాపింగ్ కలకలం

## బయటపడుతున్న కీలక ఆధారాలు



**నల్లగొండ, ఏప్రిల్ 8 (ప్రజా మంటలు):** సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసుల పాత్ర ఒక్కోటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రౌడీ షీటర్లతో కలిసి సెటిల్‌మెంట్లు, గంజాయి కేసు నిందితులు, పేకాట నిర్వాహకులు, ఇతర నేరస్థులను టార్గెట్ చేసి రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలింది.రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల సమయంలో జిల్లాకు చెందిన నేతల కదలికలను పసిగట్టేందుకు నల్లగొండలోనే వార్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురు అధికారులు గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పనిచేసిన వారే. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 2015లో నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నల్లగొండలో ఓఎస్డిగా పని చేశారు. ఏఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులు కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. డిఎస్పి ప్రణీత్ రావు.. ఎస్సైగా జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. సీఐ గట్టు మల్లు కూడా నల్గొండ జిల్లాలో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సమయంలోనే వీరితో సన్నిహితంగా మెలిగిన టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లను వార్ రూమ్ లో వీరికి కీలక భాద్యతలు అప్పగించారు.విపక్ష నేతల ఫోన్లతోపాటు రైస్ మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపారులు, ఇతర పరిశ్రమల యజమానుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లుగా దర్యాప్తు బృందం గుర్తించింది. వార్ రూమ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపార్లను బెదిరించి ఈ కానిస్టేబుళ్లు భారీ అక్రమాలకు పాల్పడ్డారట. అక్రమ దందాలు చేసే రైస్ మిల్లర్ల నుంచి నెలవారీ మామూళ్లు, పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేసేవారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని ముఖ్యమైన పట్టణానికి చెందిన రౌడీ షీటర్ తో కలసి ఓ కానిస్టేబుల్ భూ దండాలు, సీటిల్మెంట్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారు.ట్యాపింగ్‌ను అడ్డుపెట్టుకొని ఈ కానిస్టేబుళ్లు.. ఓవైపు రాజకీయ నేతలకు అవసరమైన ఫోన్లతో పాటు, మరోవైపు సొంత వ్యవహారాలకు కూడా వినియోగించ్చినట్లు తెలుస్తోంది. వార్ రూమ్ సమాచారాన్ని అడ్డుగా పెట్టుకొని టాస్క్ ఫోర్స్ పోలీసులు.. కొందరు మహిళల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళల ఫోన్లను ట్యాప్ చేసి వ్యక్తిగత సంభాషణలు విని లోబర్చుకునేవారని అధికారుల దర్యాప్తులో తేలింది. తాము కన్నేసిన మహిళలు, ఉద్యోగినుల వ్యక్తిగత జీవితాలను సైతం సదరు కానిస్టేబుళ్లు టార్గెట్ చేశారట. నల్లగొండ వార్ రూమ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 40 మంది మహిళలను లైంగికంగా వేధించారు. నల్లగొండ వార్ రూమ్?లో కీలకంగా పని చేసిన సదరు కానిస్టేబుల్.. అక్రమ కేసులో ఓ చోట నాయకుడు అరెస్టయితే దానిని అడ్డుపెట్టుకుని ఆయన కుటుంబ సభ్యులను సదరు కానిస్టేబుల్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వార్ రూమ్ లో పని చేసిన కానిస్టేబుళ్లు నిర్వాకాన్ని బయటకు చెబితే పరువుపోతుందని మహిళలు అప్పట్లో బాధిత మహిళలు ముందుకు రాలేదు. ఇపుడు బాధితుల్లో కొందరు త్వరలో బయటకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్యాపింగ్ బృందంలో పని చేసిన కానిస్టేబుళ్లు వ్యవహారంలో కొత్త కోణాలు వెలుగు చూస్తుండడంతో పోలీసు శాఖ, రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది.

# తెలంగాణలో బిజేపికి అనుకూలంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు

అనే అనుమానం వస్తుంది. **అనుకున్న స్థానాలకు బదులు మరోటి ఇవ్వడానికి కారణం ఏమిటి?**

చేవెళ్ళ టిక్కట్టు ఆశించి కాంగ్రెస్ లో చేరిన పట్నం సునీత రెడ్డిని అక్కడి నుండి మల్కాజి గిరికీ మారచడం, సికింద్రాబాద్ లో భారతీయ రాష్ట్ర సమితి ఎమ్మెల్యే దానం నాగేందర్ ను పార్టీలోకి తీసుకొని టిక్కట్టు ఇవ్వడం కూడా అక్కడి అభ్యర్థులు ఈటల రాజేందర్, మంత్రి కిషన్ రెడ్డిల గెలుపుకు అనుకూల వాతావరణం కల్పించడానికే అనే సందేహాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. దానం నాగేందర్ గెలిచిన మరుసటి రోజు నుండే ప్రభుత్వానికి ఆయనపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఆయనతో ఇబ్బంది పడ్డ బాధితులు ముఖ్యమంత్రికి ఫిర్యాదులు చేసి న్యాయం చేయమని వెదుకొన్నారు. అలాంటి వ్యక్తిని పార్టీలో చేర్చుకొని, సికింద్రాబాద్ పార్లమెంట్ టిక్కట్టు ఇవ్వడం వెనుక ఉన్న రాజకీయ కారణాలతో పాటు, ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఒక సందర్భంలో దానం అభ్యర్థిత్వాన్ని మార్చాలని కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం చూస్తున్నట్లు కూడా వినిపించింది. ఇంకా సమయం ఉందని అంటున్నారు. చూడాలి ఎం చేస్తారో.

హైదరాబాద్ స్థానం ఎలాగూ ఎం ఐ ఎం కు పరోక్షంగా అప్పగిస్తారు. ఇక మిగిలింది 11 స్థానలే. అందులో కరీంనగర్, ఖమ్మం సీట్లకు బలమైన అభ్యర్థులే దొరకడం లేదు. అదిలాబాద్ స్థానానికి ప్రజయహక్కుల పోరాట నాయకురాలు ఆత్రం సుగుణ ను ఎంపిక చేయడం అభినందనీయమే అయినా, ఆమె బిజేపి అభ్యర్థి, మాజీ ఎంపి నగేష్ ను ఎదుర్కోవడం కష్టమే. అందుకే భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే, సిరుపూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప కాంగ్రెస్ లో చేరారు.

**సింగరేణి బెల్ట్ అంతా కార్మిక నాయకుడు కొప్పుల ఈశ్వర్‌కే మద్దత్తా?**

నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబాబాద్, భువనగిరి, నిజామాబాద్, జహీరాబాద్, పెద్దపల్లి, స్థానాల్లో కూడా కాంగ్రెస్ తొపతి పడుతుందే తప్ప గెలిచే అవకాశాలు అంతంత మాత్రమే అని చెప్పాలి. పెద్దపల్లి లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భారతీయ రాష్ట్ర సమితి అభ్యర్థిగా అపోటీ చేస్తున్నారు. ఈయనకు పోటీగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వివేక్ కు కాంగ్రెస్ టిక్కట్టు ఇచ్చినా, ఆయన అభ్యర్థిత్వం పట్ల వ్యతిరేకత ఉండి. సింగరేణి కార్మికునిగా జీవితం ప్రారంభించిన కొప్పుల ఈశ్వర్ కు ఉన్న స్థానిక మద్దతు కాంగ్రెస్ అభ్యర్థికి లేదని, ఇక్కడ బి ఆర్ ఎస్ గెలుపు సులువని అనుకొంటున్నారు. ఇక్కడి బిజేపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ కూడా బిజేపిలోకి మొన్ననే కాంగ్రెస్ నుండి వలస వచ్చాడు.



## నరేంద్ర మోదిని మూడోసారి ప్రధానమంత్రి చేయాలి

### -ఎంపీ అభ్యర్థి రమేష్

వేలేర్ ఏప్రిల్ 8 (ప్రజా మంటలు) : వరంగల్ పార్లమెంట్ విజయానికి సిద్దమయ్యేందుకు ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుష్మిత గార్డెన్స్ లో జరిగిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోనీ ధర్మసాగర్ మరియు వేలేరు మండలాల విస్తృత స్థాయి సమావేశంలో బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ, దేశంలో జాతీయ రహదారులు, రైల్వేస్,పారిశ్రామిక శక్తి, విమానశ్రయాలు మోదీ హయాంలో మోదీ ముందు ఎలా ఉండేవో బేరీజు వేసుకుని మోడీకి ఓటు వేయండని కోరారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకోని ప్రజాసామ్యాన్ని కాపాడాలని, మహిళలకు సమాన హక్కులను కల్పిస్తూ సైన్యంలో కూడా మహిళలకు ప్రాధ్యానతమోదీ ఇచ్చారని, ఆడబిడ్డల ఆత్మగౌరవం కాపాడేలా 13 కోట్ల టాయిలెట్స్ నిర్మించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు,మాజి ఎమ్మెల్యే రాజేశ్వర్ రావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ రామ రావు,పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, నాయకులు సుభాష్,అసెంబ్లీ కన్వీనర్ అంజి రెడ్డి,కో కన్వీనర్ విరన్న, బీసీ మోర్చ అద్యక్షులు సంపత్,ఎస్సీ మోర్చ అద్యక్షులు భద్రయ్య,మహిళ మోర్చ అద్యక్షులు భాగ్యలక్ష్మి,మండల పార్టీ అధ్యక్షులు బూత్ స్థాయి నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు..




## మేడిగడ్డ బ్యారేజ్ ని సందర్శించిన సిపిఎం బృందం

మహాదేవపూర్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు): లక్ష కోట్లతో నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండె కాయ లాంటి మేడిగడ్డ బ్యారేజీ గత ప్రభుత్వ తప్పిదం వల్లనే ప్రాజెక్టు కుంగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. సోమవారం జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ ని సోమవారం సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ రాష్ట్ర బృందం మేడిగడ్డను సందర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ కి ఉదయం 11 గంటలకు చేరుకొని బ్యారేజి లోని కృంగిన 19,20,21 పిల్లర్ల ను పరిశీలించారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన వేడిగడ్డ కృంగిపోవడంతో లక్ష కోట్ల ప్రజాధనాన్ని నీళ్లపాలు చేశారని మండిపడ్డారు గత ముఖ్యమంత్రి కేసీఆర్ కలల ప్రాజెక్టు అని గొప్పలు చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టు ఇంత తక్కువ కాలంలోనే కృంగిపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు ప్రాజెక్టు డిజైన్ లోపమా నిర్మాణ లోపమా నిపుణులు కమిటీ తేల్చాలని అన్నారు మేడిగడ్డ కాళేశ్వరంప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యులైన ఎల్ ఎన్ టి సంస్థ లేదా గత ప్రభుత్వం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు గత ప్రభుత్వాల బాధ్యత రహితం వల్లనే ఈ సంఘటన చోటు చేసుకుందని ప్రజల డబ్బు కాబట్టి ఇంత పెద్ద ప్రాజెక్టు కట్టే ముందు అఖిలపక్షం నిపుణులతో కమిటీ వేసి నిర్మాణం చేపట్టవలసి ఉండేది కెసిఆర్ చరిత్ర సృష్టించడం కోసం చేసిన తప్పిదం వల్ల ప్రజాధనం వృధా అయిందన్నారు ఇప్పుడున్న ప్రభుత్వం బాధ్యతయుతంగా వ్యవహరించాలని బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు అదేవిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో నీటి కరువు మొదలవుతుందని వెంటనే రైతులను తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు సాగు నీటి ప్రాజెక్ట్ లో నే అత్యధిక ఖర్చు చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని, మేడిగడ్డ కుంగిపోవడం పై న్యాయ విచారణ చేసి బాధితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును కొనసా గించాలా లేదా తర్వాత ఆలోచించండి కానీ ప్రస్తుతం రైతులతో రాజకీయాలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యలు మరమ్మత్తులు చేపట్టి రైతులకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు,సీపీఎం పార్టీ పట్టణ అధ్యక్షులు వెలిశెట్టి రాజయ్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలేం రాజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం చిన్న రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, ఆకుదారి రమేష్, ఆత్కూరి శ్రీధర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత విద్య, వైద్యం అందించడమే నా లక్ష్యం

### కరీంనగర్ లోకసభ స్వతంత్ర అభ్యర్థి పేరాల మానస

జమ్మికుంట ఏప్రిల్ 08 (ప్రజామంటలు): కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరి సమస్యల పరిష్కారానికి కొట్లాడుతానని స్వతంత్ర ఎంపీ అభ్యర్థి పేరాల మానస అన్నారు. సోమవారం ఆమె జమ్మికుంట పట్టణంలోని (టీ.డబ్ల్యూజెఫ్) ప్రెస్ క్లబ్‌లో నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను తొలుత తన సమస్యల పరిష్కారానికి మాత్రమే పోరాటం చేశానని, ఈ క్రమంలో చాలా మంది యువకులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తన దృష్టికి పలు ఇష్యూస్ తీసుకొచ్చారని చెప్పారు. తన ఊరిలో మాత్రమే కాకుండా జిల్లా వ్యాప్తంగా రకరకాల సమస్యలతో చాలా కుటుంబాలు బాధపడుతున్నాయని గుర్తించానని చిన్ననాటనే తండ్రిని కోల్పోయి సమస్యలపైన పోరాడుతున్న తాను ప్రశ్నించినా సమస్యలకు సొల్యూషన్ దొరకలేదని పేర్కొన్నారు. రైతులు, యువత, నిరుద్యోగుల పక్షాన బలంగా ప్రశ్నించడంతో పాటు వారి సమస్యల పరిష్కరనికి పోరాడేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వాలు పేరుకు మాత్రమే ఉన్నాయని, వాటి అమలు క్షేత్రస్థాయిలో అసలు జరగడం లేదని విమర్శించారు. అన్ని రంగాలలో సమస్యలు చాలా ఉన్నాయని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మెయిన్ ఇష్యూస్‌కు సొల్యూషన్ ఇచ్చేందుకు, ఉపాధి కల్పన, స్టార్టప్ ఐడియాస్‌కు ప్రోత్సాహం, ఉచిత విద్య, వైద్యం వంటి అంశాలపైన తాను దృష్టి సారించనున్నట్టు నొక్కి చెప్పారు. రైతులకు పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా పోరాడుతానని తెలిపారు. కరీంనగర్ ఎంపీ స్థానానికి ఇప్పటి వరకు మహిళలు పోటీ చేస్తున్న సందర్భాలు చాలా తక్కువని, ఈ క్రమంలో తనకు యువత మద్దతు ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి యువతీ యువకులు, మేధావులు తనను సపోర్ట్ చేస్తున్నారని, మార్పు కోసం ఎన్నికల బరిలోకి దిగుతున్న తనకు మద్దతు ఇవ్వాలని ప్రజలను పేరాల మానస అభ్యర్థించారు.



## ప్రాథమికోన్నత పారశాల కుస్థాపూర్ లో ఉగాది సంబరాలు..

ఆసిఫాబాద్ ఏప్రిల్ 08 (ప్రజా మంటలు) : కుస్థాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల లో తెలుగు నూతన సంవత్సర%శీ% అయిన ఉగాది పండుగ వేడుకలు వైభవం గా జరిగాయి. షడ్రుచులు అయిన ఉప్పు, కారం, మామిడి, చింతపండు, బెల్లం, వేపపువ్వులతో ఉగాది పచ్చడి తయారుచేసి విద్యార్థులకు ఉగాది పచ్చడి యొక్క విశిష్టతను ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు వివరించారు. బెల్లం– తీపి– ఆనందానికి ప్రతీక ఉప్పు– జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం వేప పువ్వు– చేదు– బాధకలిగించే అనుభవాలు చింతపండు– పులుపు– నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు పచ్చి మామిడి ముక్కలు– వగరు – కొత్త సవాళ్లు,కారం– సహనం కోల్పోయేటట్లు చేసే పరిస్థితులను అధిగమించి జీవితం సంతోషంగా గడపాలని విద్యార్థులకు వారి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షాహబాజ్ హుస్సేన్, శృతి, సునీత, గణేష్, లహరి, విజయలక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది ఉత్సవ వేడుకలు

జగిత్యాల ఏప్రిల్ 8 (ప్రజా మంటలు) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యం లో ఉగాది వుత్సవం సోమవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక బైపాస్ రోడ్డు లోని దేవిశ్రీ గార్డెన్ లో జరిగింది. ముఖ్య అతిథిగా సత్య సాయి సేవా సమితి కన్వీనర్ బట్టు రాజేందర్, ప్రముఖ వైద్యులు డా. బి శంకర్, ప్రముఖ వైద్యులు ఆకు తోట శ్రీనివాస రెడ్డి, ప్రముఖ వ్యాపార వేత్త జిడిగే పురుషోత్తం, ప్రధాన వక్త ప్రభు కుమార్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, అశోక్ జీ, మాతలు, ఆర్ఎస్ఎస్ కార్య కర్తలు పాల్గొన్నారు. బోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు.



## కాళేశ్వరం పేరుతో దోచుకున్నారు

### రైతులను రెచ్చగొట్టే పనిలో బిఆర్ఎస్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో బిఆర్ఎస్ దొంగ ఏడ్పులు ఏడ్వాల్సిన అవసరం లేదన్నారు. కరువుకు తామే కారణమంటూ చెప్పడం సిగ్గుచేటన్నారు. సోమవారం వైరా నియోజకవర్గ కేంద్రంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్నదని.. ఆ పరిస్థితుల్లో నీటిని మొత్తం వేస్ట్‌గా దిగువ ప్రాంతాలకు వదిలారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే నీటి కొరత ఏర్పడిందని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతులను రెచ్చగొట్టేందుకు సానుభూతి పొందేందుకు కేసీఆర్ నటిస్తున్నారని.. రైతాంగం అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.సాగర్ జలాలతో ఈ ప్రాంత చెరువులు, కుంటలను నింపి త్రాగునీటి ఇబ్బందులను తొలగిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రం తీవ్రంగా దెబ్బ తిన్నదన్నారు. బీఆర్ఎస్ నాయకులు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని.. ఇది ఎప్పటికీ జరగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పేదల పక్షపాతి అని.. వారి సంక్షేమం కోసం ఎన్ని విధాలైనా కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడుతుందని వెల్లడించారు. వేసవికాలంలో వర్షాలు పడటం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుపిస్తున్నారన్నారు. వర్షాలు అనేవి ఎన్నికల కంటే ముందే వచ్చాయని.. వచ్చిన నీటిని ఆ ప్రభుత్వమే నదులు పాలు చేసిందని మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



### రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ డాక్టర్ రవీందర్ మృతి

ఎల్కతుర్తి ఏప్రిల్ 08 (ప్రజామంటలు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన ఇప్పలపల్లి రవీందర్ వయసు 52 వృత్తిరీత్యా ఆర్ఎంపీ డాక్టర్ హాస్పటల్ పనులపై జమ్మికుంటకు వెళ్లి వస్తుండగా చెల్పూర్ ఇంద్రనగర్ మధ్యల రెండు ద్విచక్ర వాహనాల ఢీకొని గాయాల పాలైన రవీందర్ ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యములో మరణించాడు. రవీందర్ పెంచికలపేటలో వృత్తిరీత్యా అందరినీ ఆదుకునేవాడని వైద్య వృత్తిలో ఎనలేని సేవలు చేశాడని పేదవారు ఎవరైనా వస్తే డబ్బులు లేకుండా కూడా వైద్యం చేసేవాడని గ్రామస్తులకు ఎనలేని సేవలు చేసేవాడని గ్రామస్తులు మృతుని కుటుంబీకులు శోకసముద్రంలో మునిగారు. పోస్టుమార్టం నిమిత్తము హుజురాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.





# క్రోధినామ ఉగాదికి ఆహ్వానం!

ఉగాది అంటే యుగారంభమని పురాణ ప్రవచనం. మనకు కొత్త వసత్సరం ఉగాదితోనే ప్రారంభం అవుతుంది. వస్తం మొదలవుతుంది. .పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు ఇదే రోజున విశ్వాన్ని సృష్టించాడని పురాణోక్తి. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణైతికంగా చెప్పబడింది. వేదాలను హరించిన సోమకుని వధించి మత్స్యవతారి యైన విష్ణువు వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందన్న పురాణ ప్రచారం కూడా ఉంది. చైత్రశుక్ల పాడ్యమినాడు విశాలవిశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించాడు కనుక సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపబడు తుందని కూడా చెప్పబడుతుంది. ఈ యేడు క్రోధి నామ సవంత్సరం. మొత్తంగా 60 వసంతాలు ఉంటాయి. ప్రభవతో మొదలై 60 ఏళ్ల తరవాత మళ్లీ ప్రభవ వస్తుంది. ప్రస్తుతం మనం క్రోధినామం లోకి ప్రవేశిస్తున్నాం. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగిలించి మానవాళిలో నూతనాశయాలను అంకురింప చేసే శుభదినం ఉగాది. శిశిర ఋతువు ఆకురాలు కాలం. శిశిరం తరువాత వసంతం వస్తుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా వుంటుంది. కోయిలలు కుహూకుహూ అని పాడుతాయి.ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. అయితే ద్వాదశ రాసులు ఎలా ఉన్నా ఉగాది నుంచి అంతా మంచే జరుగాలని కోరుకుందాం.కొత్త సంవత్సరంలో వస్తున్న ఈ ఎన్నికల్లో ప్రజలు గెలవాలని ఆకాంక్షిద్దాం. చైత్ర శుక్ల పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు తన సృష్టి ముగించాడనీ, అదే యుగారంభమనీ చెబుతారు. అయితే, ఆ రోజునే సృష్టి ప్రారంభమయిందనీ అందుకే ఆ రోజు యుగాదిగా పరిగణన పొందిందనీ అంటారు. ఉగస్య ఆది అనేదే ఉగాది. ఉగ అనగా నక్షత్ర గమనం.జన్మ ఆయుష్షు అని అర్థాలు. వీటికి 'ఆది' అనగా మొదలు ఉగాది. అనగా ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయింది. ఇంకొకవిధంగా చెప్పాలంటే, 'యుగం' అనగా రెండు లేక జంట అని కూడా అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం యుగం సంవత్సరం కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయింది. అదే సంవత్సరాది. ఉగాది వసంతాలకు గల అవినాభావ సంబంధం, సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయం కాలాది త్రికాలములకు ఉషాదేవతయే మాతృస్వరూపం.

శాలివాహన చక్రవర్తి చైత్రశుక్లపాడ్యమి నాడే పట్టాభి షిక్తుడై తన శౌర్యపరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతుందని చారిత్రక వృత్తాంతం. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంక రిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం.తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.. క్రోధి నామ సంవత్సరం మంగళవారం నాడు వస్తోంది. కాబట్టి రాజు కేతువుగా పరిగణించాలి. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో

ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవ నాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను పంచాగకర్తలు అంచనా వేస్తారు. సంవత్సరాది ఏ వారం వస్తుందో.. ఆ వారానికి అధిపతిని రాజుగా నిర్ణయిస్తారు. రాజు, మంత్రి, సేనాధిపతి పరిపాలనను నిర్ణయిస్తారు. సస్యాధిపతిని బట్టి వర్షపాతం, ధాన్యాధిపతిని బట్టి ధాన్యవృద్ధి, అర్ఘాధిపతిని ఆధారంగా నవ్వులు, మినుములు మొదలైన వాటి దిగుబడి, మేఘాధిపతి ఆధారంగా వర్షాలు, పంటలు ధరలు, రసాధిపతిని బట్టి పులుపు, చేదు మొదలైన పదార్థాల ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తారు. ఉగాది అంటేనే రానున్నకాలానికి విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాలచక్ర పరిభ్రమణం ఆధారంగా నవనాయకుల నిర్ణయం జరుగుతుంది. ఆ విశేషాలను జ్యోతిషశాస్త్రం తెలియ జేస్తుంది. ప్రతి సంవత్సరానికీ రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి, ధాన్యాధిపతి, అర్ఘ్యాధిపతి, మేఘాధిపతి, రసాధిపతి, నీరసాధిపతి అని తొమ్మిదిమంది నాయకులు ఉంటారు. వీరినే



నవనాయకులు అంటారు. ఇక ఇళ్లలో కూడా పంచాంగానికి పూజలు చేయడం కూడా ఆనవాయితీగానే వస్తోంది. చంద్రుడి నక్షత్ర యోగాన్ని అనుసరించి చాంద్రమానం, సూర్య సంక్రమణాల ప్రకారం సౌరమానం, గురూదయాన్ని ఆధారంగా చేసుకొని బార్హస్పత్య మానం లెక్కిస్తారు. ఎవరి పరంపరాగతమైన, ప్రాంతాను సౌర మానాలు వారికి ప్రమాణాలు. ఇందులో వైరుధ్యాలేమీ లేవు. గణనలో విభిన్నత్వం ఉన్నా ఫలాల్లో, పంచాంగాల

పద్ధతుల్లో పెద్దగా భేదమేదీ ఉండదు. ఈ పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది. నూతనశోభ సర్వత్రా వెల్లి విరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనంద మయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురానుభూతులను పరస్పరం పంచుకోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది.



## ఉగాది ఉదయం

అదిగదిలో అక్కడ
గాయపడ్డ కోకిల గానం వినిపిస్తోంది
ఆదుకునే దిక్కులేక అరణ్య రోదనలా
అమావాస్య చీకటిమాయలు కనిపిస్తున్నాయి

అదిగదిగో అక్కడ
నెమలి కన్నీరు కార్చలేక
ఇంకిపోయిన కనుకొలనులో
జాతి అంతరిస్తుందనే
భయంతో ఆందోళనలు మొదలైయ్యాయి

అదిగదిగో అక్కడ
కాకులు అరవడం మానేసి
వెక్కివెక్కి ఏడుస్తు చెరలో చిక్కి, బ
ంధీలై దిగులుతో బక్క చిక్కి
విలవిల్లాడుతున్నాయి

అదిగదిగో అక్కడ
చెట్లన్ని పూలు పూస్తున్న
కుక్కమూతి పిందలెక్కువై
వంకర ముఖాలుగ గోచరిస్తు
దశావతారాలెత్తున్నాయిజి

అదిగదిగో అక్కడ
సెలయేరు ప్రవాహన్ని చూసి ఆశలు ఆవిరై
ఎండమావిలా కనుమరుగైపోయే నమ్మలేని
అసత్య ప్రచారాలు ఎక్కువై య్యాయి

అదిగదిగో అక్కడ
నేలరాలిన ఆకులు ఎరువై
చెట్లకు బలాన్నిస్తుండగ
పచ్చని వనాలు ధ్యంసమై
కనుమరుగవుతున్నాయి

అదిగదిగో అక్కడ
ప్రకృతి తన్మయత్వంతొ
ప్రవాహంలా గాలి వీస్తుంటే
సేదతీరిన జీవాలు ఎందుకో
చెల్లాచెదురైపరుగెత్తుతున్నాయి

అదిగదిగో అక్కడ
ఐక్యతలేని మానవజాతి పరస్పర విరుద్ధ భావాలతో
చెద పురుగులపుట్టి నశించి పోయేకాలాలు దాపురించాయి

ఇదిగిదిగో ఇక్కడ
రాలిన ఆకుల మొనలోంచే చిగురిస్తున్న
చిగురాకు సైన్యం
నవయువతరంతొ నవనవోన్మే షంగ
ఉగాది ఉషోదయాలు కనిపిస్తున్నాయి

-కూచన మల్లయ్య మహర్షి
పెద్దపల్లి_జిల్లా_7095026350

## ఓటరు దేవుడు



ఏనాడూ చేతులెత్తి దైవాన్ని మొక్కని నాయకుడు
నేడు ఓట్ల కోసం వంగి వంగి చేతులెత్తి మొక్కుతున్నాడు
మీ అవసరాలు ఏవైనా తీరుస్తానంటున్నాడు
ఒక్క సారి అవకాశం ఇవ్వమని ప్రాధేయపడుతున్నాడు
అతని పాట్లు చూసి దేవుడే నవ్వుకుంటున్నాడు
ఐదేళ్ళలో ఏనాడూ ప్రజల దగ్గరకు రాని వాడు
సమస్యలు పరిష్కరించని వాడు
ఓట్లు కోసం ప్రజల ముంగిటకు వచ్చాడు
నోట్ల ఎర చూపుతూ ప్రలోభ పెడుతున్నాడు
మీ ఓట్లు నాకే అంటూ భ్రమ పడుతున్నాడు
ఆ నాయకుని జిమ్మిక్కు చూసిన పౌరుడు
నోట్లు వద్దని ప్రజలను ప్రజలను వారిస్తున్నాడు
వ్యక్తులను చైతన్య పరుస్తున్నాడు
నోట్లు ఇచ్చే వాడు మనకోసం పని చేయడు
ఐదేళ్లు ఇటు చూడడు
ఓటరు దేవుడు
నీవు మారాలి ఇప్పుడు
నీ ఓటు అందుబాటులో ఉన్న నాయకుడికే.

– కనుమ ఎల్లారెడ్డి,
ఆస్టిన్, టెక్సస్ స్టేట్, అమెరికా, 93915 23027.




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## కాకి విలువ



అనగనగా ఒక ఊరు.ఆ ఊరి చివరన ఒక ఇల్లు.ఆ ఇంట్లో వేప చెట్టు,అరటి చెట్టు ఉన్నాయి.ఒకరోజు ఒక కాకి తన పిల్లలతో కలిసి అక్కడికి వచ్చింది. వేప చెట్టు వద్దకు వెళ్ళి "మిత్రమా ఊరిలో ఎక్కడా ఉండడానికి అనువుగా లేదు. నీ పై నివసించడానికి నాకు ఆశ్రయం ఇస్తావా" అని అడిగింది కాకి.

" ఇంతమాత్రం దానికే నన్ను అడగాలా? నీవు నీ పిల్లలతో ఉంటే నాకు సందడిగానే ఉంటుంది.అందరూ కలిసి ఉండటంలోనే కదా సంతోషం ఉంది. అంతకన్నా ఏమి కావాలి .ఎన్ని సంవత్సరాలైనా ఉండు "అని చెప్పింది వేప చెట్టు.

ఆకాశంలోకి రివ్వున ఎగురుకుంటూ సన్నని కర్రపుళ్ళలను తీసుకొని వచ్చి గూడును ఏర్పాటు చేసుకుంది . తన పిల్లలతో కలిసి సంతోషంగా నివసించసాగింది కాకి.

రోజులు గడుస్తున్నాయి .కాకి ఆహారం కోసం తన పిల్లలతో కలిసి ఊర్లోకి వెళ్ళింది. వేపచెట్టు పక్కన ఉన్న అరటి చెట్టు, వేపచెట్టు తో మాట కలిపింది. "మిత్రమా అందంగా ఉన్న నీపై కాకి దాని పిల్లలు ఉండటం వల్ల నీ అందం అంతా పోయింది . పైగా వాటి గొలతో ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి.కాకితో మాట్లాడి నివాసాన్ని మార్చుకోమని చెప్పు" అన్నది అరటి చెట్టు.

"ఇన్ని రోజులు నువ్వు ఎంత మంచి దానివో అనుకున్నాను. మన జీవితమే పరులకోసం అన్న విషయం మర్చిపోయావా? అందునా కాకి నీకు ఏమీ అపకారం చేసింది.అది ఉండటం వల్ల మన ఇల్లు సందడిగా మారింది.కాకి కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుతుంది.మనం మానవులకు ఏ విధంగా సహాయ పడుతున్నామో కాకి కూడా అదేవిధంగా సాయపడుతుంది" అన్నది వేపచెట్టు. తన తప్పుడు ఆలోచనకు అరటి చెట్టు తలదించుకుంది.కాకి తో కూడా కలివిడిగా ఉండ సాగింది .అన్నీ కలిసి మెలిసి సంతోషంగా జీవించసాగాయి.

**వేముల పావని దుర్గ, 6 వ తరగతి**
**6305393291**

# పండుగలకు ఆది పండుగ ఉగాది

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

ఏడాది పండుగ, ఉగాది పండుగ అనే దేశ్య నామాలతో వ్యవహరింపబడే సంవత్సరాది పర్వము, ఏటా రానున్న ఎన్నతగిన ఏభై పైచిలుకు పండుగలలో మొదటిది. తెలుగువారు తమ సంవత్సరాదిని చాంద్రమాన గణనాధారంగా చైత్ర శుక్ల ప్రతిపదతో ప్రారంభించడం సనాతన ఆచారం. చైత్ర శుక్ల పాడ్యమి సంవత్సరాది అని బ్రహ్మపురాణం కంఠోక్తిగా చెపుతున్నది. అలాగే ఈదినం నుండి సృష్టి ప్రారంభింపబడి, ఆయా దేవతలకు సంబంధిత పనులను బ్రహ్మ అప్పగించినట్లు పురాణ కథనం. శాలివాహన శకానికి మొదటి దినం చైత్ర శుక్లపక్ష పాడ్యమిగా భావించబడు తున్నది. వనవాసానంతరం శ్రీరాముడు సీతా, లక్ష్మణ సహి తంగా అయోధ్యకు ఈనాడే తిరుగు ప్రయాణమై నట్లు పురాణ లిఖితం. వసంత కాలారంభ దినాలలో చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సంవత్సరాది పర్వం జరిపే ఆచారం ఆర్యుల్లో అతి ప్రాచీన కాలం నుండి ఉన్నది. పార్సీలు ఉగాదిని "నౌరోజ్" అంటారు. నౌరోజ్ అనగా కొత్తదినం. ఉగాది పర్వా చరణ విధానాలను నూతన సంవత్సర కీర్తనాద్యా రంభం, ప్రతి గృహ ధ్వజారోహణం, నింబ వ్రతాశనం, సంవత్సరాది శ్రవణం, నవరాత్రి ఆరంభమని ధర్మసింధువు స్పష్టం చేస్తున్నది. ప్రతిగృహ ధ్వజారోహణం, అబ్దాది తైలాభ్యంగం, నవవస్త్రాభరణ ధారణం, ఛత్రచామరాది స్వీకారం, ఉమామహేశ్వర పూజ, దమనేన బ్రహ్మపూజనం, సర్వాపచ్ఛాంతికర మహాశాంతి, నింబ కుసుమ భక్షణం, పంచాంగ పూజ, శ్రవణం, ప్రపాదాన ప్రారంభం, రాజదర్శనం వాసంత నవరాత్రి ప్రారంభం...పది విధాయక కృత్యాలుగా చెప్పబడినాయి.



**వసంత నవరాత్రుల ప్రారంభం**

చైత్ర వైశాఖమాసాలు వసంత రుతువుకాగా, చైత్రమాస తొలిరోజు ఉగాదితో వసంతరుతు ఆరంభం కాగలదు. చైత్రానికి మధుమాసమని, వసంతమాసమని పేరు. "మధుశ్చ మాధవశ్చ వాసంతి కావృత్" అనే యజుర్వేద వాక్యాన్ని బట్టి వేదకాలంలో చైత్రానికి మధుమాసమని పేరున్నట్లు తెలుస్తున్నది. రుతురాజైన వసంతునికి స్వాగతోప చారాలు చేయడానికి తొమ్మిది రోజులను నిర్దేశిం చారు. ఉగాదినాడు కలశ స్థాపన చేసి, నవరాత్ర పూజ చేస్తే అపమృత్యు భయముండదని ధర్మ సింధు వివరిస్తున్నది.

వాత్సాయన కామ సూత్రాలలో ఈ ఉత్సవం "సువ సంతక"మని, "మదనోత్సవ"మని పేర్కొనబడింది. రుతురాజైన వసంతుని పూజిస్తే కాలాత్మకుడైన పరమ శివుడు ప్రసన్నుడు కాగలడని భావన. వసం తోత్సవాలు తెలుగు నేలపై గొప్పగా జరిగేవి. ఉత్సవ సందర్భంగా రాజ దర్బారుల్లో ప్రతిదినం నృత్యాలు, నాట్యాలు పాట కచ్చేరీలు, పండిత గోష్టులు, శాస్త్ర విచారణలు, నాటక ప్రదర్శనలు జరిగేవి. సంగీతం ప్రధానంగా ఉండేది. ఆకాలాన ఉప యుక్తమైన వసంత రాగమును మేళకర్తలు ప్రత్యేకంగా కూర్చారు. రెడ్డిరాజుల, విజయనగర రాజుల కాలంలో ఉద్యానవనాల్లో మామిడి చెట్టుకింద మంటపం, దానిపై కలశం నెలకొల్పి పూజాపీఠంపై వసంతుని, రతీ మన్మధులను, లక్ష్మీ నారాయణులను, గౌరీ శంకరులను, శచీ పురంధరులను నెల కొల్పి, మంగళ వాద్యాల, వారాంగనల నృత్యాలు పన్నీరు, వసంతం చల్లుకోవడం, విద్యా వినోదాలు, క్రీడా ప్రదర్శనలు జరిగేవి. ప్రభువు హయారూఢుడై ఊరేగి వచ్చి, ఉద్యానవనంలో మంటపం వద్ద దేవతలను పూజించేవాడు. మంగళ వాద్యాలు, వారాంగనల నృత్యాలు, పన్నీరు, వసంతం చల్లుకోవడాలు, విద్యా వినోదాలు, వినోద క్రీడలు జరిగేవి.

**ఏరువాక ప్రారంభం**

ఉగాదినాడు కొన్ని ప్రాంతాలలో ఏరువాక సాగడం ఆచారం. ఎద్దులను కట్టి దున్నుటకు సిద్ధపరిచిన నాగలిని "ఏరువాక" అంటారు. రైతులు ఉగాది నాడు తలంటి పోసుకుని, బొట్టు పెట్టుకుని, కొత్తబట్టలు వేసుకుని, నాగలికి పాత తాళ్ళు తీసి, పసుపురాచిన కొత్తవి కట్టి, నాగలికి, కాడికి రావి మండలు కట్టి, ఎడ్లకు పసుపురాసి, కుంకుమ పెట్టి పూజించి, కొబ్బరికాయ కొట్టడం సాంప్రదాయాచరణ. ఉగాది నాడు కారణాంతరాల వల్ల ఏరువాక సాగకపోతే మంచిరోజుతో ప్రారంభించ బడాలి. ఏరువాక సాగ నిదే కొత్త ఏడు ఎడ్లచేత వ్యవసాయ పనులు చేయించరు.

తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో ఈనాటి సాయంత్రం ఊరిలోని బండ్లను అలంకరించి మంచి ఎడ్లను పూన్చి కొంతదూరం ఊరేగిస్తారు. చైత్ర శుద్ధ పాడ్యమినాడు విద్యా, పౌరుష, ప్రతిపత్ తిలక, ధనావ్యాప్తి, సర్వాప్తి, చతుర్యాగ, చతుర్మూర్తి దేవమూర్తి, నదీ, లోక, శైల, సముద్ర, ద్వీప, సప్త మూర్తి, సప్తసాగర మున్నగు వ్రతాలను అచరించా లని చతుర్వర్ణ చింతామణిలో పేర్కొనబడింది.

**ఉగాది పచ్చడి**

"యద్వర్షాదా నింబసుమం, శర్కరామ్ల ఘృతై ర్యుతమ్, భక్షితం పూర్వయామేస్యా, త్తద్వర్షం సౌఖ్యదాయకమ్". అని పెద్దల ఉవాచ. ఉగాది నాడు ఆ ఏటి వేపపువ్వు, చక్కెర (లేదా కొత్తబెల్లం), చింత పండు, నెయ్యి కలిపి చేసే పచ్చడిని మొదటి జాము నందే తింటే ఆ వత్సరమంతా సుఖంగా జరుగు తుందని విశ్వాసం. వేపపువ్వు ప్రధాన ద్రవ్యంగా చేసే పచ్చడి గొప్ప ఔషధంగా భావించ బడుతుంది.

# కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి వేడుకలపై అధికారులతో కలెక్టర్ సమావేశం

**జగిత్యాల ఏప్రిల్ 08 (ప్రజామంటలు):**
ఈ నెల 22 నుండి 24 వరకు కొండగట్టు హనుమాన్ దేవాలయంలో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా, సంప్రదాయబద్ధంగా అన్ని ఏర్పాట్లతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు దేవాలయ ఆధ్వర్యంలో నిర్వహించాలని అన్నారు. జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కు 7 స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, పార్కింగ్ ప్రాంతాల్లో త్రాగునీరు, శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయములకు 14 కౌంటర్లు, కేశఖండన ప్రత్యేక దర్శనం టికెట్ల కౌంటర్లకు 12 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆయా కౌంటర్లలో 3 షిఫ్టులలో సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీక్ష స్వాముల మాల విరమణ చేయుటకు కోనేరు వద్ద గల హాల్ నందు 3 షిఫ్టులలో అర్చకులను ఏర్పాటు చేసి మాల విరమణ చేయుటకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. నూతన కోనేరులోని నీటినీ ఎప్పటికప్పుడు పంపిణి చేసి శుభ్రపరచడం జరుగుతుందని, 120 షవర్ బాత్ లు మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా డ్రెస్సింగ్ రూం లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కేశ ఖండనం చేసుకొనుటకు వీలుగా 1500 మంది నాయీ బ్రాహ్మణులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. తలనీలాలు ఇచ్చే ప్రాంతంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా క్యూ పద్దతిని పాటించే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలలో 76 శాశ్వత మరుగుదొడ్లు, 58 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీక్ష స్వాములు




కూర్చునేందుకు ప్రత్యేక పందిళ్ళు, బారికేడ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ప్రాంగణం, రోడ్లు , ధర్మశాలాలు, చుట్టూ పక్కల పారిశుధ్య పనులు నిరంతరం నిర్వహించడానికి అవసరమైన సిబ్బందిని ప్రత్యేక గౌన్లు వేసుకొని విధులు నిర్వహించుటకు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఆలయ సమీపాలు, చుట్టూ పక్కల ప్రాంతాలలో 28 చలి వెంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి కాలి నడకన వచ్చే భక్తులకు రేడియం స్టిక్కర్లను అందించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో కాలి నడకన వచ్చే భక్తులకు స్టిక్కర్లు అందించడం ద్వారా వాహన ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. కాలి నడకన వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు ఆయా గ్రామాలలో చలి వెంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. స్వామి వారి ఆలయం ప్రత్యేకంగా విద్యుదీపాలంకరణ చేయడం జరుగుతుందని, ఎప్పటికప్పుడు అనౌన్స్ మెంట్ ద్వారా భక్తులకు మరింత సేవలు అందించాలని సూచించారు. దేవాలయం, వివిధ ధార్మిక స్వచ్చంధ సంస్థల ద్వారా అన్నదాన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, స్వచ్చంధ సంస్థలకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. దేవాలయం లోపల, బయట 64 సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 5 ఆరోగ్య కేంద్రాలను దేవాలయం లోపల, బయట ఏర్పాటు చేయడం జరుగుతుందని, వేసవి కాలం దృష్ట్యా అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. దేవస్థానం తరపున పార్కింగ్ స్థలాల నుండి దేవాలయం వరకు భక్తుల సౌకర్యార్థం రెండు బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని, విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు, తదితర ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా అవసరమైన నీటి సరఫరా కొండపైకి వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. దేవాలయ అవసరాల నిమిత్తం నీటి వసతి కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రెండు అంబులెన్సు లను సిద్ధంగా ఉంచాలని రెడ్ క్రాస్ సహకారం తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతూ అత్యవసర సమయాల్లో అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని అన్నారు. కరీంనగర్, వేములవాడ, వరంగల్, మంచిర్యాల, సిరిసిల్ల, హుజురాబాద్, కోరుట్ల, మెట్ పల్లి, జగిత్యాల డిపోల నుండి భక్తుల సౌకర్యార్థం కొండగట్టుకు బస్సుల సౌకర్యం కల్పించాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. భక్తులకు మంచి సౌకర్యాలు కల్పిస్తూ స్వామి వారి దర్శనం కలిగించే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. జిల్లా యంత్రంగం ఆధ్వర్యంలో అధికారులను జాతర సమయంలో పంపించడం జరుగుతుందని తెలిపారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అధికారులు తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, అదనపు ఎస్పి వినోద్ కుమార్, డిఎస్పి రఘు చందర్, కొండగట్టు ఆలయ ఈ.ఓ. చంద్రశేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నవశక్తిని అందించే ఉగాది



తెలుగు ఉగాది వెలుగు
పునాది
కొత్త ఉగాది క్రోధి ఉగాది
మమతలు పంచే ఉగాది
మల్లెల గుబాళింపు ఉగాది

గతానుభవాలను మిగిల్చి
భవిత పై ఆశలను రగిల్చి
కాలం ఒడిలో
ఒదిగిపోయింది శోభకృత్ ..

మోదుబారిన చెట్లు చిగురించగా
కొత్త రాగాలతో కోయిల పిలుపు
వీనులకు విందు చేయగా
తెలుగువారి లోగిళ్ళు సరికొత్తశోభ తో
అలరారగా
మానవతా విలువల వెలుగులు
విరజిమ్ముతూ క్రోధి భానుడు
ఉగాది తెస్తూ ఉదయించాడు..

పసిపిల్లల పై అత్యాచారాలు అబలల పై
అఘాయిత్యాలు
అవినీతి అక్రమాలు
అన్నదాతల ఆర్తనాదాలు
నిరుపేదల ఆవేదనలు నిరుద్యోగుల నైరాశ్య
భావనలు
మతోన్మాదుల అకృత్యాలు
ముష్కరమూకల మూర?పుదాడులు
గతం చేసిన గాయాల బాధలు,
చేదు జ్ఞాపకాల అనుభవాలు,,
దూరంచేస్తూ...
మానవాళి కి నవశక్తి ని అందిస్తూ
ముందున్నదంతా మంచికాలమే నని ఊరిస్తూ
మానవజాతిని ఉత్తేజపరుస్తూ
ముందుకొచ్చింది క్రోధి ఉగాది
మనసారా ఆహ్వానిద్దాం రండి..

చెరుకు మహేశ్వర శర్మ
రాయికల్, జగిత్యాల

# ఎమ్మెల్యే సంజయ్ కి రైతుల గురించి మాట్లాడే అర్హతనే లేదు

## సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

**మల్లాపూర్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):**
కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కి రైతుల గురించి మాట్లాడే అర్హతనే లేదని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల నియోజకవర్గం మ ల్లాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మాట్లాడుతూ.... ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని తెరిపించకపోతే తాను షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి మీ తండ్రి



ఎమ్మెల్యేగా గెలిచాడని కానీ నేటి వరకు ఆయన పదవీకాలం పూర్తయినంతవరకు ఫ్యాక్టరీ తెరిపించలేదని దీనికి ఏం సమాధానం చెబుతారు మీ తండ్రి కొడుకులు అని కృష్ణ రావు నిలదీశాడు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ బిజెపిలు కలిసి మూసివేసిన చక్కెర కర్మాగారాలను తిరిగి తెరిపిస్తామని పేర్కొన్నామని ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరలోనే షుగర్ ఫ్యాక్టరీ ఖచ్చితంగా తెరిపిస్తామని అన్నారు గత సంవత్సరం అక్టోబర్ నవంబర్ నెలలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి పది టి ఎం సి ల నీటిని దొంగ చాటుగా సిద్దిపేట ప్రాంతానికి తరలించకపోయారనిఆ నీటిని ఫామ్ హౌస్ కు ఉపయోగించుకున్నారని అన్నారు టిఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండగా కోరుట్ల నియోజకవర్గం లో ఉన్నటువంటి ముత్యంపేట చక్కెర కార్మాగారని ఎందుకు తెరిపించలేదు ప్రజలకు జవాబు చెప్పాలని కృష్ణారావు అన్నారు 2018 లో జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోని రైతులందరికీ రుణ మాఫీ చేస్తామని టిఆర్ఎస్ పార్టీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని కానీ తెలంగాణ రాష్ట్రంలోని 85% మంది రైతులను టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని కేవలం 15 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని ఇంత మోసం గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా రైతులకు రుణమాఫీ చేసి తీరుతుందని ఈ మేరకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ తో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. చర్చలు ముగిసిన అనంతరం రైతు రుణమాఫీ కచ్చితంగా ఉంటుందని నూటికి నూరు శాతం రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కృష్ణారావు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షునిగా మాజీ జెడ్పిటిసి సభ్యులు ఎలా జలపతి రెడ్డిని నియమించిన సందర్భంగా జువ్వాడి కృష్ణారావు అభినందించారు. జలపతి రెడ్డి తన నియామకానికి సహకరించిన జగిత్యాల జిల్లాలోని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే లు లక్ష్మణ్ కుమార్ ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నరసింగరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీని మరింత ముందుకు తీసుకుపోదామని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుంద్ర శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, అబ్బూరి నాగరాజు బండారి రమేష్, నూతిపెల్లి రాజం, ఎర్ర భూమయ్య, కోటగిరి ఆనంద్,మెట్పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జట్టిలింగం యువజన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, శేఖర్, చిప్ప లక్ష్మీం, మరిపెల్లి మల్లయ్య, మైపాల్, జమాల్, ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లకు 'అలర్ట్ ఇండికేషన్' రేడియం స్టిక్కర్లు అంటించిన ఎస్సై ప్రసాద్

**మహాదేవపూర్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):**
మహాదేవపూర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ లో ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో మహాదేవపూర్ గ్రామానికి సంబంధించిన ట్రాక్టర్లకు అలర్ట్ ఇండికేషన్ కు సంబంధించిన రేడియం స్టిక్కర్లు ట్రాక్టర్లకు అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ఇటీవల రోడ్డు పక్కన నిలుపుతున్న వాహనాలకు రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గనుక రేపటి నుండి ట్రాక్టర్ యజమానులు రేడియం స్టిక్కర్లు, నంబర్ ప్లేట్స్ లేని ట్రాక్టర్ల పై తగు చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కాబట్టి ట్రాక్టర్ యజమానులు తమ ట్రాక్టర్ కి రేడియం స్టిక్కర్స్ మరియు నెంబర్ ప్లేట్స్ ఉండాలని ఎస్సై అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చక్రపాణి సివిల్ కానిస్టేబుల్స్ సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



# మన పండుగ "ఉగాది"

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08 (ప్రజామంటలు):**

**ఏదైనా ఓపనిని కొత్తగా ప్రారంభించేందుకు మంచి రోజేనా? కాదా? అని ఆలోచించే ఓ విధానాన్ని మనకు ముందుగా నేర్పింది బ్రహ్మదేవుడే. ఎందుకంటే ఆయనే సృష్టిని ప్రారంభించడానికి ఏది మంచిరోజు? అని ఆలోచించి, ఒక మంచిరోజున సృష్టిని ప్రారంభించాడు. అదే యుగ ఆది రోజు ఉగాది రోజు, ఈ యుగాది రోజు అన్నివిధాలా మొదటిదై ఎలా మంచి రోజయిందో వివరంగా చూద్దాం!**

'సృష్టి చేద్దా'మనుకోగానే చతుర్ముఖ బ్రహ్మకాలగణనం లోని 60 సంవత్సరాల్లో సంవత్సర ప్రారంభంలోనే సృష్టి చెయ్యాలనుకున్నాడు. కాలంలోని అరవై సంవత్సరాలలోనూ మొదటిదైన ప్రభవ సంవత్సరంలో ఉత్తరాయణంలో వసంతఋతువులో చైత్రమాసంలో – శుద్ధ (శుక్ల) పక్షంలో పాడ్యమిలో బ్రాహ్మీముహూర్తంలో సృష్టిని ప్రారంభించాడు. కాబట్టి చైత్ర శుద్ధ పాడ్యమి అయిన ఈ రోజు ఈ విధంగా యుగ ఆది రోజు – ఉగాదిరోజు – సర్వప్రథమమైన రోజు ఔతోందన్నమాట. ఈ రహస్యాన్ని మరచిపోకుండా చేసేందుకే మొట్టమొదటగా కోసిన మామిడి ముక్కలని, మొట్టమొదటిసారి తీసిన వేపపూతతోనూ, మొట్టమొదటగా వండిన బెల్లం తోనూ, మొట్టమొదటగా పిసికిన చింతపండుతోనూ, మొట్టమొదటగా తెచ్చిన ఒకటి రెండు మిరియపు గింజల పొడితోనూ, కలిపి తినే పచ్చడిగా చేసి, భగవంతునికి నివేదించి, ప్రసాదంగా స్వీకరించాలి. ఈ యుగాదిని సృష్టించినవాడు బ్రహ్మ కాబట్టి, పంచభూతాలైన పృథివి–అప్–తేజస్–వాయు ఆకాశాల్లో మార్పును కూడ సృష్టించాడు. ఆయన. అందుకే పృధివి (భూమి)లోని ప్రతి వృక్షమూ కొత్త కొత్త చిగురుటాకుల్ని వేస్తూ, కొత్త చీరల్ని కట్టుకున్న ముత్తైదువల్లా గోచరిస్తాయి.కృతయుగం వైశాఖ శుద్ధ తదియనాడూ. త్రేతాయుగం కార్తిక శుద్ధనవమినాడూ, ద్వాపరయుగం శ్రావణ శుద్ధ త్రయోదశినాడూ ప్రారంభంకాగా, కలియుగం మాత్రం చైత్ర శుద్ధ పాడ్యమినాడు. ప్రారంభమైంది.

**ఇతిహాసపరంగా....**
ఉగాది పండుగ వచ్చే వసంతకాలానికీ ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు నెలల్లో మొదటి రెండూ అయిన చైత్రం, వైశాఖం కలిపి వసంతఋతువు లేదా వసంతకాలం అవుతోంది. అలాంటి ఈ వసంతకాలం ఎంత గొప్పదో ఇతిహాసమైన శ్రీమద్రామా యణం ప్రకారం చూద్దాం!

'చైత్ర శ్రీమా నయం మాసః పుణ్యః పుష్పిత కాననః'– రాముని పట్టాభిషేకానికి ఈ వసంత కాలమే మంచిదని వశిష్ఠాదిమహర్షులు నిర్ణయించారు. మఱి పట్టాభిషేకం తప్పిపోయింది గదా!' అనుకోకూడదు. పట్టాభిషేకం చెడితే తప్ప రాముడు అరణ్యాలకుపోడు. అలా కాని పక్షంలో సీతాపహరణం లేదు. అది లేనివాడు రావణ వధ సాధ్యం కాదు. అలా కాని రోజున రామునిగా ఆయన అవతారమే వ్యర్థమౌ తుంది. ఇంతటి కష్టమైన పనికి దేవతలంతా ఏ కాలం మంచిది? అని ఆలోచించి అందరూ ఐకమత్యంతో నిర్ణయించిన కాలం వసంతం అందునా చైత్రమాసం!

సీతాపహరణం జరిగింది వసంతకాలంలోనే. రాముడు తనను చంపడానికి రాగలడనే విషయం రావణునికి తెలిసిందికూడా వసంతంలోనే! ఆంజనేయుడు మొదటిసారిగా రామచంద్రుణ్ణి చూచిందీ, అహంకారం పోయి తనకంటే రాముడెంతటి గొప్పవాడో ఆ విషయం సుగ్రీవునికి అర్థమైందీ– రామునిచేతిలో వాలికి మోక్షం లభించిందీ– సీతమ్మకు రాముని వార్తలు మొదటిసారిగా అందిందీ రావణవధ అయ్యాక అయోధ్యలో రామచంద్రుడు పట్టాభిషిక్తు డయిందీ అన్నీ కూడా వసంతకాలంలోనే!

అమ్మవారిక్కూడా ఇష్టమైంది. ఈ కాలమే కాబట్టి, ఈ వసంతకాలంలోనే వసంతనవరాత్రుల పేరిట దసరా ఉత్సవాల్లాగా చేస్తారు. బుద్ధిశక్తి బాగా పెరగడానికి 'చదువుల తల్లి సరస్వతిని బాగా పూజించవలసింది ఈ కాలంలోనే' అంటూ 'వత్సరారంభ సంపూజితా' అనే సరస్వతీ సహస్రనామాల్లోని ఒక నామం కూడా చెప్తుంది.

**వైద్యపరంగా వేప....**
ఇక ఉగాది పచ్చడిలో షడ్రుచులూ ఉంటాయి. మధుర (తీపి), ఆమ్ల (పులుపు), కటు (కారం), కషాయ (ఒగరు), లవణ (ఉప్పదనం), తిక్త (చేదు) రుచులు ఆఱూ కలిసి ఉంటాయి. తీపిని కలిగించే కొత్తబెల్లం ఆకలిని కలి గిస్తుంది. పులుపునిచ్చే కొత్త చింతపండు కఫవాతాల్ని పోగొడుతుంది. కారాన్ని కలిగించే మిరియపు పొడి శరీరంలోని క్రిముల్ని నాశనం చేయడమేకాక శ్లేష్మ రోగాల్ని దగ్గరకి రానీయదు. వగరు పుట్టించే మామిడి ముక్క లాలాజలాన్ని ఊరించి జీర్ణక్రియకి తోడ్పడుతుంది. ఎముకలని బలపరుస్తుంది ఉప్పు, చేదు కలిగిన వేపపువ్వు చేసే లాభాల్ని ఎన్నింటిని చెప్పినా ఏదో ఒకటి మరిచినట్టే ఔతుందిట. అంత గొప్పది వేపపువ్వు. వేపచెట్లగాలి. ఆరోగ్యప్రదం. వేపచిగుళ్లు కడుపులోని నులిపురుగుల్ని చంపేసి తిరిగి పుట్ట నీయవు. వందకు వందేళ్లూ జీవించే ఈ చెట్టునుంచి వచ్చిన కల్లు, కుష్ఠువ్యాధిని నివారిస్తుంది. దీని ఆకుల్ని బియ్యంలో గాని, పుస్తకాల మధ్యలో గాని పెడితే పురుగు దరిచేరనే చేరదు. వేపగింజలతో నూనె చేసి శరీరానికి రాసు కుంటూంటే కొంతకాలానికి బొల్లి కూడా నయమౌతుంది. వేపాకును పసుపు నూనెతో కలిపి ముద్ద చేసి ఒంటికి ప్రతివారాంతంలో రాస్తే ఏ తీరు చర్మ వ్యాధైనా సమసిపోతుంది. వేపపూవుని కోసి, ఎండ బెట్టి పొడిచేసి, ఆ పొడిని, ఎండిపోయిన తులసి చెట్టును కాల్చిన భస్మంతో కలగలిపి తింటే యమ దర్శనం కానేకాదట!

**ఉగాది రోజును ఎలా గడపాలి?**
మనం తెల్లవారుజామునే లేచి కాలకృత్యాలు ముగించాక, ఇంట్లో ఉన్న పెద్ద ముత్తైదువ ఆయురారోగ్యా శ్వర్యాలతో ఉండవలసిందని దీవిస్తూ మన మీద అక్షతల్ని వేసి తలకు (మాడు మీద) నువ్వుల నూనెను పెట్టాలి.ఆ మీదట మనం ఒంటరిగా నువ్వుల నూనెని రాసుకుని, ఒక గంటసేపు నూనెతో నానాక సున్నిపిండితో తలంటు పోసుకోవాలి. నూనెతో నానే సమయంలో వ్యాయామం గానీ, దైవస్తోత్రాలుగాని రెండూగానీ చేసు కోవచ్చు. అభ్యంగన స్నానమయ్యాక నిత్యం మనం చేసుకునే పూజ ముగించుకుని దైవమందిరంలో ఉన్న అక్షతల్ని ఇంట్లో ఉన్న పెద్దవారికిచ్చి, వాళ్లకు పాదాభివందనం చెయ్యాలి. పసుపుబొట్టు పెట్టిన కొత్తబట్టల్ని మనకిస్తూ ఆశీర్వదించాలి– వాళ్లు. మనం కొత్త బట్టలు కట్టుకుని దేవుడికి అంతకు ముందే నైవేద్యం పెట్టిన వేపపూవు పచ్చడిని ఆరగించాలి.

**పంచాంగ శ్రవణం:**
సరిగా ఈ సమయానికి గుళ్లోనో లేక మరో ప్రదేశంలోనే పంచాంగ పఠనం ప్రారంభమవుతుంది. సంవత్సరంలో 'మన జీవితం, మనల్ని పరిపాలించే పాలకుల రాజ్యం, మననందరినీ పరిపాలించే ఆ భగవానుని అభి ప్రాయం' ఎలా ఉందో ఆ విషయమంతా దీనిద్వారా తెలుసుకోగలుగుతాం. మనం చేసిన పాప పుణ్యాల కనుగుణంగా మనకు రావాల్సిన లాభనష్టాల్ని గమ నించిన భగవంతుడు, లాభాల్ని కల్గించేందుకు శుభగ్రహాలనూ, నష్ట పెట్టేందుకు అశుభగ్రహాలనూ నాయ కులుగా



నియమిస్తూ కొత్త సంవత్సరాన్ని నిర్మిస్తాడు.

**శుభాకాంక్షలు:**
ఇంతకీ ఇలా అన్నిటికీ ప్రథమమైన ఉగాదినాడు శుభాకాంక్షలు ఇలా తెలపాలని మన పెద్దలు మనకు చెప్పారు. 'ప్రజలందరికీ సుఖం కలుగుగాక! పరిపాలకులు న్యాయ మార్గంలో పాలింతురు గాక! హెూమాలు చేయడానికై పాలనిచ్చే గోవులవల్లా– భూమిని దున్ని పంటనిచ్చే ఎద్దుల వల్లా–ఆవులవల్ల వచ్చే పాలనూ, ఎద్దులవల్ల వచ్చిన ధాన్యాన్నీ యజ్ఞంలో వినియోగించే వేదవేత్త అయిన బ్రాహ్మణుని వల్లా దేవతలు తృప్తిపడి సమస్తలోకాలనీ చల్లగా చూతురుగాక! సకాలంలో వర్షాలు పడునుగాక! భూమినిండా అందరికీ సంతానమూ ఉండుగాక! సంపదలేనివారికి సంపదలు కలిగి, దేశమంతా శాంతిమంతమై ఉండుగాక! ఏ ఒక్కరూ దుఃఖాన్ని పొందకుండుదురుగాక! రాజులు నిర్భ యంగా తమ పరిపాలన చేయుదురుగాక!'– అనేవి మహర్షు లిచ్చిన శుభాకాంక్షలు.

పైగా శుభాకాంక్షలనగానే ఉగాది రోజున ఉదయాన్నే లేచి తల్లి దీవెన పొందుతూ మాడు (బ్రహ్మరంధ్రం) పైన నూనె పెట్టించుకుని తల్లికీ తండ్రికీ నమస్కరించి, తలంటుపోసుకుని కొత్త బట్టలు ధరించి దైవదర్శనం చేస్తే, తమ సంతానంమీద ఆ తల్లిదండ్రుల ఆశీస్సులు ఫలిస్తాయి. పిల్లలబుద్ధి వికసిస్తుంది. కూడా! – ఇది ఋషులు చెప్పిన నిజం అనుభవంలో ఉన్న సత్యం!

# రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలి

## మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల ఏప్రిల్ 08 (ప్రజామంటలు): రంజాన్ సందర్భంగా పట్టణంలోని మజీద్, ఈద్గా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న సౌకర్యాలను పరిశీలించి లైటింగ్, శానిటేషన్, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తగినంత బ్లీచింగ్ చల్లాలని అన్నారు.



అలాగే ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఈ పండుగను ముస్లిం సోదర సోదరీమణులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి అన్ని రకాల సౌకర్యాలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దుర్గయ్య, నాయకులు మన్సూర్ భాయ్, భారీ భాయ్, నీలం పెద్దులు పాల్గొన్నారు.

# తీవ్ర వేసవిలో బట్టర్ మిల్క్, దుస్తులు పంపిణి

సికింద్రాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు): తీవ్రమైన వేసవిలో ఇబ్బంది పడుతూ విధులు నిర్వహిస్తున్న ఆర్ టి సి డ్రైవర్లు, కండెక్టర్లకు రోడ్ల పక్కన జీవనం సాగిస్తూ అనాథలు, నిరాశ్రయులకు ఆదివారం బట్టర్ మిల్క్, దుస్తులు, నీళ్ల ప్యాకెట్స్ పంపిణి చేసి వాహనదారులకు, పాదచారులకు బట్టర్ మిల్క్ పంపిణి చేసిన స్కై ఫౌండేషన్ నిర్వాయకులు. తీవ్రతరమైన వేసవిలో బట్టర్ మిల్క్ పంపిణి చేసినందుకు ఆర్ టి సి



డ్రైవర్లు, కండెక్టర్లు, వాహనదారులు, పాదచారులు, నిరాశ్రయులు అందరూ స్కై ఫౌండేషన్ కు కృత్ఞతలు తెలియజేసారు. ఎండ తీవ్రత రోజు రోజుకు ఎక్కువ అవుతుంది, ప్రతి ఒక్కరు తీవ్రమైన ఇబ్బందిలు పడుతున్నారు, ప్రభుత్వం తక్షణమే స్పందించి ,నగరంలో అని ప్రధాన కూడలిలలో, బస్సు స్టాండ్ లలో చల్లని నీళ్లు అందించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని సేవా సభ్యులు హరీష్ కుమార్, అఖిల్ మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.

# సి.ఎం. రేవంత్ రెడ్డి ని కలిసిన కడియం కావ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

వేలేరు ఏప్రిల్ 08 (ప్రజామంటలు): హైదరాబాద్ గాంధీ భవన్లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం వారి నివాసంలో సమావేశమయ్యారు. లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణ,



క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులకు బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కూడ చైర్మన్ %ఒ% పరకాల నియోజకవర్గం ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్ కుమార్ –బొడ్డు సునీత, వర్ధన్నపేట నియోజకవర్గం ఇన్చార్జి నమ్మిండ్ల శ్రీనివాస్, డా. రియాస్, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భక్త మార్కండేయ దేవాలయములో

# సోమావతి అమావాస్య సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలు

జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణంలోని శివునికి ప్రీతికరమైన వారం సోమవారం, ఈ రోజున వచ్చే అమావాస్యను సోమావతి అమావాస్యగా పరిగణిస్తారని, ఈ సోమావతి అమావాస్య రోజు స్త్రీలు ఉదయం బ్రహ్మ ముహూర్తంలో లేచి స్నానాదులు ముగించి, రావి చెట్టుకు



108 ప్రదక్షిణం చేయడం వల్ల, కుటుంబంలో కలతలు దూరమై ప్రశాంతత నెలకుంటుదని, భర్త దీర్ఘాయువు మంతుడు అవుతాడని, సంతానం, కుటుంబం బాగుంటుందని భక్తుల నమ్మకంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

# ముందస్తు ఉగాది వేడుకలు

కొడిమ్యాల ఏప్రిల్ 08 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని సంద్రాల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది పండుగ వేడుకలు ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా షడ్ రుచులు (ఆరు రకాలు) తీపి, పులుపు,కారం, ఒగరు, చేదు, ఉప్పులతో ఉగాది పచ్చడి తయారు చేసి, సరస్వతి దేవి కి పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని విద్యార్థులకు అంద జేశారు. తర్వాత విద్యార్థులు వివిధ పాటలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి మాట్లాడుతూ.... ఉగాది పండుగ విశిష్టత, పద్ధతులు, ఆరు రకాలు రుచుల గురించి విద్యార్థులకు తెలుపడం జరిగిందనీ, ఉగాది పండుగ రోజున ఉదయం లేచి కొత్త బట్టలు ధరించి ప్రతీ ఒక్కరు దేవాలయం కు వెల్లి దర్శనం చేసుకొంటారని,సాయంత్రము వివిధ ఆలయాలలో పంచాంగ శ్రవణంను ఆలయ పూజారులు వినిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, ఉపాద్యాయులు స్వర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



# విజ్ఞాన్ నెక్ట్ జెన్ లో ముందస్తు ఉగాది సంబరాలు

హుజూరాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు): హుజూరాబాద్ పట్టణంలోని స్థానిక విజ్ఞాన్ నెక్ట్స్ జెన్ పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల



విద్యార్థులు పచ్చడికి కావలసిన పదార్థాలను సేకరించి పాఠశాల ఆవరణలో విద్యార్థులు, టీచర్లు కలిసి ఉగాది పచ్చడిని తయారు చేశారు. ముఖ్యంగా పచ్చడికి కావాల్సిన పదార్థాలైన వేపపువ్వు, బెల్లం, మామిడికాయ, చింతపండు, కారం, ఉప్పు, మొదలగు షడ్రుచులచే ఈ మిశ్రమాన్ని తయారు చేశారు. తదనంతరం పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉగాది సంబరాలను పాఠశాలలో ఘనంగా జరుపుకుంటామని, మన జీవితాలలో షడ్రుచులవలే అప్పుడప్పుడు బాధలు, సుఖ సంతోషాలు వస్తాయని, వాటిని ధైర్యంతో ఎదుర్కోవడమే జీవితం అని తెలిపారు. ఆ తర్వాత పాఠశాల ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ.... జనవరి ఒకటిన జరుపుకునేది ఆంగ్ల సంవత్సరమని, మన హిందూ సాంప్రదాయం ప్రకారం ఉగాది రోజున నూతన తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుందని, ఇదే రోజున పంచాంగ శ్రవణం, గోమాత పూజలు తదితర కార్యక్రమాలు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కడియం కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వేలేరు ఏప్రిల్ 08 (ప్రజామంటలు): వేలేరు మండల కేంద్రంలోని మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుజ్జుల రామ్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ



అభ్యర్థి కడియం కావ్య ను పీచర గ్రామం నుంచి సుమారు 30 మంది వెళ్ళీ కలిసినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కత్తి సంపత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ బిల్లా వెంకటేశ్వర్లు, జిల్లా సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, మైనార్టీ శాఖ అధ్యక్షులు పాషా దేవ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ సీనియర్ నాయకులు రన్ దేర్ రెడ్డి, కొమురయ్య, సీనియర్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు అంగన్వాడి కేంద్రాలలో స్కూల్ డే కార్యక్రమాలు

గొల్లపల్లి ఏప్రిల్ 08 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలంలోని గోవిందుపల్లె నందిపల్లి వెంగలాపూర్ శంకర్రావుపేట అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్, మమత, జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల యొక్క తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మంచి అలవాట్లు సంభాషణ ఆటలు పాటలు కథ సంభాషణ శాస్త్రీయ పరిజ్ఞానం మొదలైన కార్యక్రమాలు తల్లుల ఆధ్వర్యంలో పిల్లలతో చేపించి చూపించడం మరియు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రీస్కూల్ విద్య ప్రాముఖ్యత బాల్యారంబదశ అతి ముఖ్యమైన భాగాలలో పూర్వ ప్రాథమిక విద్య ఒకటి ఇది ఐసిడిఎస్ కు మూల స్తంభం లాంటిది. ఈ విద్య యొక్క ముఖ్య ఉద్దేశ్యం పిల్లలకు ఆనందంగా ఆటపాటలతో కూడుకున్న కార్యక్రమాలను అందించి ప్రాథమిక పాఠశాలలో చేర్చడానికి వారిని సంసిద్ధులను చేయడం ఇది పిల్లల సమగ్ర వికాసం మీద కేంద్రీకరించబడినది పిల్లల సృజనాత్మకత శక్తిని వ్యక్తీకరించడం సామాజిక ఉద్వేగ మానసిక శారీరక అభివృద్ధి కండరాభివృద్ధి భాషాభివృద్ధి చిన్న కండరాల అభివృద్ధి పెద్ద కండరాల అభివృద్ధి కంటికి చేతికి సమన్వయము ఈ పూర్వ ప్రాథమిక విద్యలో పిల్లలకు అందించడం జరుగుతున్నది తప్పనిసరిగా మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించవలెనని వారికి ఆటపాటల ద్వారా విద్యను అందించడం పిల్లలు అందరితో కలిసిమెలిసి ఉండడము బడికి అలవాటు చేయడము జరుగుతుందని నర్సరీ, త్రీ ప్లస్, ఎల్కేజీ ఫోర్ ప్లస్, యూకేజీ అంగన్వాడి టీచర్లు ప్రణాళిక ప్రకారం నిర్వహించడం జరుగుతుందని పిల్లలకు సంవత్సరంలో మూడు సార్లు అభివృద్ధి సూచికలు ఇవ్వడం జరుగుతుందని శారీరక సామాజిక వ్యక్తిగత భావోద్వేగా మేధో వికాసం భాష బడికి సంసిద్ధత మొదలైన కార్యక్రమాలు నిర్వహించి పిల్లలు పాల్గొంటున్న వారి స్థితిని గమనించి వారికి ఆగస్టు డిసెంబరు ఏప్రిల్ నెలలలో వీరిని అసెస్ చేసి వారికి స్టార్స్ తల్లులకు అవగాహన కలిగించనైనది తల్లులతో కూడా ప్రీస్కూల్ ప్రాముఖ్యత గూర్చి మాట్లాడించడం ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ మమత, జ్యోతి పంచాయతీ కార్యదర్శి సంజీవ్, దామోదరు, అంగన్వాడీ టీచర్స్ సరోజన, రజిత, పద్మ, హేమలత, గర్భవతులు పిల్లలు పాల్గొన్నారు.




వీణవంక మండలం ఎల్బాక గ్రామములో శతాధిక వృద్ధురాలు 110 సంవత్సరాల తూముల రాజమ్మ అనారోగ్య కారణంగా మృతి చెందింది. వారి అంత్యక్రియల్లో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు. పాడె మోసిన మహిళలు.



పద్మశాలి సేవా సంఘం బుగ్గారం మండల శాఖ వారి క్యాలెండర్ ఆవిష్కరించిన జగిత్యాల మున్సిపల్ చైర్ అడువాల జ్యోతి లక్ష్మణ్

# ఫోన్ ట్యాపింగ్‌లో నా పాత్రలేదు

- ఆ వ్యవహారంతో నాకు సంబంధం లేదు
- నా గెస్ట్ హౌస్‌లో ఎలాంటి తనిఖీలు జరగలేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.నవీన్ కుమార్



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.నవీన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. ఈ కేసులోకి తనను కుట్రపూరితంగా లాగే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తన గెస్ట్ హౌస్‌లో ఎలాంటి పోలీసు తనిఖీలు జరగలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. తన గెస్ట్ హౌస్ అడ్డాగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు... పోలీసు అధికారుల భేటీలు జరిగినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. తనపై దుష్ప్రచారం చేసేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## లలిత కళా సమితి వారి ఆధ్వర్యంలో జరిగిన

# ఉగాది రంగస్థల నృత్య కేలి



మెట్ పల్లి ఏప్రిల్ 08 (ప్రజామంటలు): మెట్ పల్లి లో లలిత కళా సమితి వారి ఆధ్వర్యంలో ఉగాది రంగస్థల నృత్య కేలి కార్యక్రమం ఘనంగా జరిగింది. లలిత కళా సమితి అధ్యక్షులు మట్టెల గంగాధర్ మాట్లాడుతూ.... ఆదివారం రాత్రి 9 గంటలకు రోజున ఎస్సారెస్పీ గార్డెన్ లో శాస్త్రీయ జానపద నృత్యాలు కళా నాట్య విన్యాసాలు అలాగే కార్యక్రమాన్ని కళాకారులు కళాభిమానులు సన్మాన గ్రహీతలు తిరు కోవెల లక్ష్మణ స్వామి ప్రముఖ కళాకారులు అలాగే సినీ నటులు గోదురు మురళి వారికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మపురి ఆలయ మాజీ చైర్మన్ జువాడి కృష్ణారావు జిల్లా కళాకారులు సన్మాన సత్కారాలు చేశారు. అనంతరం జువాడి కృష్ణారావు మాట్లాడుతూ కళాకారులు పెట్టింది పేరు తెలంగాణలో జగిత్యాల జిల్లాలో మన మెట్ పల్లి ప్రాంతంలో అత్యధిక మంది కళాకారులు ఉన్నారని అలాగే లలిత కళా సమితి భవన నిర్మాణానికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు తనవంతుగా ప్రభుత్వం దృష్టికి వెళ్లి సహాయం చేస్తానని కళాకారులకు అన్ని విధాల ప్రభుత్వం తరఫున సహాయం సహకారాలు ప్రభుత్వం అందించే పథకాలు వర్తింప చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. లలితా కళా సమితి తరఫున జువ్వాడి కృష్ణారావు కి సమితి అధ్యక్షులు మట్టెల గంగాధర్ మరియు కళా సమితి సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మట్టెల గంగాధర్ టి నవీన్ కుమార్, కోటగిరి వెంకటస్వామి, కోటగిరి చైతన్య, మద్రి భాస్కర్, చొప్పరి శ్రీనివాస్, కళాకారులు భూపతి గౌడ్, భుజంగరావు, అందే మారుతి, సంజీవ్, మధు, నరేష్, సూర్య, టి. శ్రీకాంత్, శ్రీ శేఖర్, శివానందం, అపర్ణ, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పండుగను పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని పలు దేవాలయాల్లో, పరిసర ప్రాంతాలలో పారిశుద్ధంపై ప్రత్యేక పనులను పర్యవేక్షించిన జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ప్రతి టెంపుల్ ముందు శుభ్రంగా ఉంచాల్సిందిగా జవాన్లకు, కార్మికులకు సూచనలు చేశారు.

# ఆర్ఎంపి వైద్యుడు రాజేష్ మృతి

# నివాళులర్పించిన జువ్వాడి కృష్ణారావు

మెట్ పల్లి ఏప్రిల్ 08 (ప్రజామంటలు): మెట్ పల్లి పట్టణానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు రాజేష్ ముదిరాజ్ అనారోగ్యంతో మరణించగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు రేగుంట రోడ్డు లోని రాజేష్ నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. భగవంతుడు రాజేష్ ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టిలింగం, ఆడెపు రమణ తదితరులు ఉన్నారు.



# సీఎం రేవంత్ ఇంటిదగ్గరే అడ్డా..

## - ఫోన్ ట్యాపింగ్‌లో వెలుగులోకి సంచలన విషయాలు



హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు): రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో లోతుగా వెళ్లే కొద్దీ సంచలన విషయాలు బయటకొస్తున్నాయి. జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి సమీపంలోని ఓ గెస్ట్ హౌస్ లో సోమవారం ఉదయం పోలీసులు సోదాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ నవీన్‌ది తెలుస్తోంది. ప్రతిపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్ కోసం ఈ గెస్ట్ హౌస్ నే ప్రణీత్ రావు బృందం డెన్ గా మార్చుకుని ఉంటుందని దర్యాప్తు బృందం భావిస్తోంది. సీఎం రేవంత్ ఇంటికి కూతవేటు దూరంలో ఉండడంతోనే తమ పని అక్కడి నుంచే సులువు అవుతుందని ఆ టీం భావించినట్లు చెబుతున్నారు.ఈ గెస్ట్ హౌస్ నుంచే అడిషనల్ ఎస్పీ భుజంగరావు ట్యాపింగ్ ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం. నిందితులు విచారణలో వెల్లడించిన సమాచారం మేరకే పోలీసులు ఇప్పుడు గెస్ట్ హౌస్ లో సోదాలు నిర్వహించారు. ఫోన్ ట్యాపింగ్ ఆపరేషన్ కు పొలిటికల్ ఇంటెలిజెన్స్ ఆఫీస్ కంటే నవీన్ రావు గెస్ట్ హౌస్ మేలని.. ఇక్కడే మీటింగ్ పెట్టి తతంగం అంతా నడిపినట్లు దర్యాప్తులో నిందితులు వెల్లడించినట్లు తెలు స్తోంది. ఈ కేసుకు సంబంధించి త్వరలో నవీన్ రావును దర్యాప్తు బృందం పిలిచి విచారించనున్నట్లు సమాచారం. అటు, ఈ వ్యవహారం నల్గొండ జిల్లాలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను సైతం ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా డబ్బు పంపిణీతో పాటు వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. దీనిపైనా దర్యాప్తు బృందం విచారిస్తోంది. అయితే, ఫోన్ ట్యాపింగ్ కు వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ నుంచే సమకూర్చుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మాదాపూర్ లోని ఓ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇందుకు సంబంధించి టెక్నలాజికల్ టూల్ ను అందించే కన్‌స్టలెన్సీగా వ్యవహరించినట్లు తేలింది. టెలీ కమ్యూనికేషన్ రంగంలో అపార అనుభవం ఉన్న ఆ కంపెనీ ద్వారానే సాఫ్ట్ వేర్ ను సమకూర్చుకున్న ప్రణీత్ బృందం.. దీన్ని అక్రమ వ్యవహారాలకు వినియోగించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎస్ఐబీలోనే రెండు ప్రత్యేక గదులు ట్యాపింగ్ వ్యవహారానికి కేంద్రంగా ఉన్నాయని.. బయటి ప్రాంతాల్లో సర్వర్లు పెట్టి నిఘా ఉంచలేదని ఇప్పటివరకూ జరిగిన దర్యాప్తులో తేలింది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే ఫోన్ ట్యాపింగ్ నిలిపేసినట్లు దర్యాప్తులో తేలింది. ఎస్ఐబీలో 17 కంప్యూటర్లలోని 42 హార్డ్ డిస్క్ లను తీసేసి.. వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చారని తెలుస్తోంది. ఈ కారణంగా మావోయిస్టులకు సంబంధించిన సమాచారం కూడా లేకుండా పోయిందని సమాచారం. పోలీస్ విచారణలో ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగానే మూసీ నదిలో నాలుగో బ్రిడ్జి కింద హార్డ్ డిస్క్ శకలాలను స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సీరియస్ గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మొదట మాజీ పోలీస్ అధికారి ప్రణీత్ రావు ను అరెస్ట్ చేసింది. విచారణలో ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లతో పాటు ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నేతల ఫోన్లు ట్యాప్ చేసి వారి ఎన్నికల సంబంధిత, వ్యక్తిగత విషయాలపై నిఘా పెట్టారని అభియోగాలున్నాయి. తెలంగాణలో ప్రభుత్వం మారిన సమయంలో ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ ఆడియో రికార్డు చేసిన హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మార్చి 28న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావును పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## పక్షులు అంతరించిపోతున్నాయి

### వాతావరణం, జీవావరణం మధ్య సమతుల్యత పాటించాలి

### వాతావరణ మార్పులపై సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ,ఏప్రిల్8 (ప్రజా మంటలు):
వాతావరణ మార్పుల హెచ్చరికలను ప్రపంచం గుర్తించింది. 2070 నాటికి 'జీరో ఎమిషన్స్' సాధించాలనే భారత్ అంతర్జాతీయ నిబద్ధతకు మద్దతు లభించింది. ఇదిలా ఉండగా.. వాతావరణం, జీవావరణం మధ్య సమతుల్యతను పాటించాలని సుప్రీంకోర్టు మొదటిసారిగా ఆదేశాలు ఇచ్చింది. బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి మారడం, దాదాపు అంతరించిపోయిన గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షిని రక్షించడం వంటి వాటిని ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు సమతుల్యతను పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షిని గోదావన్ అని కూడా పిలుస్తారు, ఇది రాజస్థాన్‌లో కనిపిస్తుంది. 2019 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తులు రద్దు చేశారు. ఆ ఉత్తర్వు.. రాజస్థాన్, గుజరాత్‌లలో 90,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విద్యుత్ ప్రసార మార్గాలను నిషేధించింది. సౌర విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తుంది. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 450 గిగావాట్లకు పెంచాలనే భారతదేశ లక్ష్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది. ఇప్పుడు గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి యొక్క 13,000 చదరపు కిలోమీటర్ల కోర్ ఆవాసాన్ని మినహాయించి, 77,000 చదరపు కిలోమీటర్లలో విద్యుత్ ప్రసార మార్గాలపై నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ఈ కేసు నిర్ణయాన్ని ఆదివారం అప్‌లోడ్ చేసింది. దీని ప్రకారం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచడం, పక్షులను రక్షించడం మధ్య సమతుల్యతను సాధించడంపై దృష్టి కేంద్రీకరించబడింది. విద్యుత్ తీగలు ఢీకొని చాలా పక్షులు చనిపోతాయని, అందుకే పర్యావరణవేత్త ఎం.కె. రంజిత్ సింగ్ వాదనల ఆధారంగా హై ఓల్టేజీ వైర్లపై నిషేధం విధించారు.ఈ అంశాన్ని క్షుణ్ణంగా విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏడుగురు సభ్యులతో కూడిన కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తన నివేదికను జులై 31లోగా ప్రభుత్వం ద్వారా కోర్టుకు సమర్పించనుంది. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలను బెంచ్ అంగీకరిస్తూ.. 'పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే భారత్ నిబద్ధత, ముఖ్యంగా గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే ఉంది. ' ఈ ఆదేశాలు ఇచ్చింది.

## పలు నేరాల కింద రిమాండ్ కు తరలించబడ్డ వ్యక్తికి గతంలో బాధితుల పక్షాన దేహశుద్ధి



జగిత్యాల ఏప్రిల్ 8 (ప్రజా మంటలు)
ఓ వివాహిత మహిళను బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారానికి పాల్పడ్డ తారకరామ నగర్ జగిత్యాల కు చెందిన కోటగిరి మోహన్ ను బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం నేరస్తుని రిమాండ్ కు పంపారు. ఇతనిపై జగిత్యాల టౌన్ పిఎస్ లో 6 కేసులు జగిత్యాల రూరల్ పిఎస్ లో 5 కేసులు మరియు కొడిమ్యాల పిఎస్ యందు ఒక కేసుతోపాటు మొత్తం 12 కేసులు ఉన్నాయి. సదరు వ్యక్తి గతంలో సైతం పలుమార్లు వివిధ కేసులు కింద వివిధ వ్యక్తులతో తప్పుగా ప్రవర్తించడంతో సదరు నేరస్తుడు మోహన్ ను గతంలో బాధితులు దేహశుద్ధి చేసినట్లు దాఖలాలు ఉన్నాయి. సదరు నేరస్తుని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుకుంటున్నారు.

## ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు

## అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలి..






కొడిమ్యాల ఏప్రిల్ 8(ప్రజా మంటలు)
జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కోడిమ్యల కేంద్రంలో జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ వంటి కవాతును అడిషనల్ ఎస్పీ భీమ్ రావు జెండా ఊపి ప్రారంబించారు.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని అన్నారు.ఎలక్షన్ కమిషన్ సూచించిన గైడ్లెన్స్ ప్రకారం పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తారని తెలియజేశారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించడంలో భాగంగానే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా,గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసారు. అక్రమ మద్యం,నగదు రవాణాకు సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫ్లాగ్ మార్చ్ లో డిఎస్పీ రఘు చందర్, సి ఐ ఎస్ ఎఫ్ అదికారులు, సీ.ఐ రవి,మరియు ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది, సి ఐ ఎస్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచు కన్నప్పలో ప్రభాస్ కీ రోల్



టాలీవుడ్ నటుడు మంచు విష్ణు హీరోగా వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప' . మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బ్జడెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. రీసెంట్‌గా మహాశివరాత్రి కానుకగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ కూడా వదిలారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో విష్ణు జలపాతం నుంచి ఎంట్రీ ఇస్తూ.. బాణంను ఎక్కుపెట్టినట్లు కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. తాజాగా మూవీకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో ఇప్పటికే మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో అగ్రహీరో ఈ సినిమాలో నటించబోతున్నాడు. బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించ నున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై మేకర్స్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్‌లో లాంగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం ఇండియాకు తిరిగొచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఏప్రిల్‌లో మొదలయ్యే తాజా షెడ్యూల్‌లో ప్రభాస్ జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది.

# బర్త్‌డే బాయ్ బన్నీ..వెల్లువెత్తిన విషెస్

## పుష్ప-2 నుంచి అల్లు గెటప్ విడుదల




నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలిపారు. ఇప్పటికే టాలీవుడ్ అగ్ర నటుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు బావ అంటూ బన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్‌కు ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు.హ్యాపీ బర్త్ డే బన్నీ.. జాతీయ అవార్డుగ్రహీత, చక్కటి అభినయ కౌశలం కలిగిన కథానాయకుడు అల్లు అర్జున్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో బన్నీ మరిన్ని పురస్కారాలు, విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ పవన్ కళ్యాణ్ తెలిపాడు. నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులతో పాటు పలువురు సెలబ్రిటీలు బన్నికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ పుష్ప.. ది రూల్. ఈ సినిమాకు లెక్కల మాస్టార్ సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ సినిమా నుంచి నేడు బన్ని బర్త్ డే కానుకగా టీజర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. గంగమ్మ తల్లి జాతరలో అమ్మవారి గెటప్ లో అల్లు అర్జున్ ఫైట్ సీన్‌తో ఫుల్ యాక్షన్ ప్యాక్ట్‌డ్‌గా సాగింది ఈ టీజర్. సోమవారం అల్లు అర్జున్ పుట్టినరోజు పురస్కరించుకుని చిత్రబృందం స్పెషల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. 'పుష్ప ది రూల్' టీజర్ విడుదల చేసింది. సినిమాలో కీలకంగా సాగే జాతర సన్నివేశాలతో ఇది సిద్ధమైంది. మాస్ అవతార్‌లో బన్నీ లుక్స్, యాక్షన్ సన్నివేశాలు ఈలలు వేయించేలా ఉన్నాయి. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన చిత్రం 'పుష్ప ది రైజ్'. 2021లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఎర్రచందనం కూలీ నుంచి స్మగ్లింగ్ సిండికేట్‌కు నాయకుడిగా పుష్ప ఎలా ఎదిగాడని మొదటి భాగంలో చూపించారు. మరి, సిండికేట్‌కు లీడర్ అయ్యాక పుష్పకు ఎదురైన సవాళ్లు ఏమిటి? మంగళం శ్రీను, భన్వర్ సింగ్ షెకావత్, దాక్షాయణి నుంచి ఎలాంటి ప్రమాదం పొంచి ఉందనే అంశాలతో 'పుష్ప ది రూల్' సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ తెరకెక్కిస్తున్న సీక్వెల్ ప్రాజెక్టులో కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. శ్రీవల్లిగా డీగ్లామరైజ్‌డ్ రోల్‌లో కనిపించనుంది . పార్టు 2లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

### అల్లుకు చిరు బ్రదర్స్ శుభాకాంక్షలు

నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్ అగ్ర నటుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు బావ అంటూ బన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్‌కు ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. హ్యాపీ బర్త్ డే బన్నీ.. జాతీయ అవార్డుగ్రహీత, చక్కటి అభినయ కౌశలం కలిగిన కథానాయకుడు అల్లు అర్జున్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో బన్నీ మరిన్ని పురస్కారాలు, విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ పవన్ కళ్యాణ్ తెలిపాడు. మరోవైపు చిరంజీవి కూడా అల్లు అర్జున్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. పుట్టినరోజు శుభాకాంక్షలు డియర్ బన్నీ. ఈ సంవత్సరం మీకు సంతోషం, సక్సెస్‌లతో నిండలాని కోరుకుంటున్నాను. పుష్ప టీజర్ సూపర్‌గా ఉంది అంటూ రాసుకోచ్చాడు.

### నిత్యామీనన్‌కు బర్త్‌డే విషెస్

మలయాళ బ్యూటీ నిత్యామీనన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తొలి సినిమా 'అలా మొదలైంది' తోనే తిరుగులేని పాపులారిటీ తెచ్చుకున్న ఈ భామ ఆ తర్వాత 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' ఇలా బ్యాక్ టు బ్యాక్ హిట్లతో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా పేరు సంపాదించుకుంది. రీసెంట్‌గా 'భీమ్లానాయక్', 'తిరు' సినిమాలతో మళ్లీ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చేసింది. నిత్యామీనన్ పుట్టినరోజు సందర్భంగా నిత్యాకు సోషల్ మీడియా వేదికగా ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు.ఇదిలావుంటే నిత్యా పుట్టినరోజు సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి మేకర్స్ అప్‌డేట్ ఇచ్చారు. నిత్యామీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డియర్‌ఎక్స్. ఈ సినిమా కోలీవుడ్ దర్శకురాలు కామిని దర్శకత్వం వహిస్తుండగా.. బాస్క్ టైమ్ థియేటర్, పోస్టర్ మీడియా నెట్‌వర్క్ బ్యానర్‌లపై, ఆదిత్య అజయ్ సింగ్, రామ్కి సంయక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి నిత్యా పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇక ఈ ఫస్ట్ లుక్‌లో పెళ్లి కూతురు గెటప్‌లో నిత్యా కనిపిస్తూ ఒకవైపు డ్రింక్.. మరోవైపు ఫోన్ పట్టుకుని ఉంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రానున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. వినయ్ రాయ్, నవదీప్, ప్రతీక్ బబ్బర్, దీపక్ పరంబోల్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# టీమిండియా ఫ్యూచర్ కెప్టెన్ అతడే




ప్రస్తుతం టీమిండియా కెప్టెన్?గా రోహిత్ శర్మ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వైస్ కెప్టెన్?గా హార్దిక్ పాండ్యా ఉన్నారు. ఒకవేళ ఫ్యూచర్?లో అవకాశాలు వస్తే..సీనియార్టీ ప్రకారం బుమ్రా, హార్దిక్ పాండ్యా, రాహుల్ లాంటి వారు ఉన్నారు. వారినీ కాదని.. టీమిండియా స్టార్ ప్లేయర్?కు ఫ్యూచర్ కెప్టెన్ ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ఓటేశారు. ఇంతకీ ఆ ఆటగాడు ఎవరనుకుంటున్నారా..? గుజరాత్ టైటాన్స్ జట్టుకు కెప్టెన్?గా వ్యవహరిస్తున్న శుభ్?మాన్ గిల్.. ఐపీఎల్ 2024లో గుజరాత్ జట్టుకు కెప్టెన్?గా ఉన్న గిల్.. తన వ్యూహాత్మక నిర్ణయాలతో జట్టును ముందుకు నడిపిస్తున్నాడు. కాగా.. ఈ సీజన్?లో ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్?ల్లో రెండింటిలో గెలిచి, మూడు మ్యాచ్?ల్లో ఓడిపోయారు. అయినప్పటికీ గిల్ తన కెప్టెన్సీతో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. గిల్.. తన కెప్టెన్సీలో ఫీల్డ్ ను సెట్ చేయడం, ఏ బౌలర్ ను ఎప్పుడు బౌలింగ్ వేయించాలనేది అద్భుతంగా సెట్ చేస్తున్నాడు. మరోవైపు.. తన బ్యాటింగ్ తో రాణిస్తున్నాడు. ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడిన గిల్ 45.75 సగటుతో 183 పరుగులు చేశాడు. కాగా.. గిల్ కెప్టెన్సీకి ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ఫిదా అయిపోయారు. అతనిపై ప్రశంసల జల్లు కురిపించాడు. గిల్‌కు అద్భుతమైన కెప్టెన్సీ స్కిల్స్ ఉన్నాయని వాన్ కొనియాడాడు. లక్నోతో జరిగిన మ్యాచ్ లో గిల్ కెప్టెన్సీకి వాన్ ఫిదా అయిపోయాడు. 'శుబ్‌మన్ గిల్ సారథిగా రోజుకు రోజుకు మరింత ఇంప్రూవ్ తున్నాడు. అతడు భవిష్యత్తులో కచ్చితంగా టీమిండియా కెప్టెన్ అవుతాడు. అందులో ఎటువంటి సందేహం లేదని' గుజరాత్-లక్నో మ్యాచ్ అనంతరం వాన్ ట్విట్ చేశాడు.



## హార్దిక్ పాండ్యాకు గాయం.. బౌలింగ్‌కు దూరం!

ఐపీఎల్ 2024 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం (ఏప్రిల్ 07) ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన ముంబై ఇండియన్స్ 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.ముంబై నిర్దేశించిన 234 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు మాత్రమే చేసింది. ముంబై నుంచి రోహిత్ శర్మ (49), ఇషాన్ కిషన్ (42), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (39), టిమ్ డేవిడ్ (45), రొమారియో షెపర్డ్ (39) అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. హ్యాట్రిక్ పరాజయాలతో డీలా పడిన ముంబై ఇండియన్స్ కు ఢిల్లీపై విజయం భారీ ఊరట నిచ్చింది. ముంబై ఇండియన్స్ అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ, ఆ జట్టు అభిమానుల్లో ఒక సందేహం మెదులుతోంది. అదేంటంటే.. హార్దిక్ పాండ్యా మళ్లీ గాయపడ్డాడా? ఈ కారణంతోనే ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచులో పాండ్యా బౌలింగ్ చేయలేదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. గతేడాది వన్డే ప్రపంచకప్ 2023లో హార్దిక్ పాండ్యా గాయపడ్డాడు. కొన్ని నెలల పాటు క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. అతను నేరుగా %ఖూా% 2024లో తిరిగి వచ్చాడు. అయితే ఢిల్లీతో మ్యాచ్ కు ముందు బౌలింగ్ వేసిన పాండ్యా ఆదివారం నాటి మ్యాచ్ లో మాత్రం అసలు ఒక్క ఓవర్ కూడా వేయలేకపోయాడు. దీంతో పాండ్యా గాయపడ్డాడనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే దీనిపై క్లారిటీ ఇచ్చాడు ముంబై కెప్టెన్. 'నేను బాగానే ఉన్నాను. సరైన సమయంలో బౌలింగ్ చేస్తాను. ఆదివారం మ్యాచ్ లో అంతా బాగానే జరిగింది. అందుకే బౌలింగ్ చేయలేదు' అని మ్యాచ్ అనంతరం హార్దిక్ పాండ్యా అన్నాడు. ముంబై ఇండియన్స్ విజయంలో నిజమైన హీరో రొమారియో షెపర్డ్. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. చివరి 10 బంతుల్లో 39 పరుగులు చేశాడు. దీంతో ముంబై ఇండియన్స్ స్కోరు 234కి చేరింది. రొమారియో షెపర్డ్ మొత్తం నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లు బాదాడు.

## 'వ్యక్తిగత ప్రదర్శన ముఖ్యం కాదు..' డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్ శర్మ స్పీచ్..!




హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2024లో తొలి విజయాన్ని సాధించింది. 29 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్?ను ఓడించి గెలుపు రుచి చూసింది. ఈ సీజన్?లో ముంబై ఇండియన్స్?కు రోహిత్ శర్మ కెప్టెన్‌గా లేనప్పటికీ.. అతనిలో నాయకత్వ స్ఫూర్తి ఇప్పటికీ కనిపిస్తుంది. మ్యాచ్ గెలిచిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్?లో రోహిత్ శర్మ స్పీచ్ ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 49 పరుగులు చేశాడు. కాగా.. ముంబై ఇండియన్స్ బ్యాటర్లు చెలరేగడంతో 234 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ తర్వాత లక్ష్యచేధనలో ఢిల్లీ క్యాపిటల్స్ 205 పరుగులు మాత్రమే చేసింది. ఈ సీజన్ నుంచి ముంబై కొత్త సంప్రదాయానికి తెరతీసింది. మ్యాచ్‌లో రాణించిన ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు స్పెషల్ అవార్డులను అందిస్తోంది. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు మెడల్ ను అందజేశారు. బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ రోహిత్‌కు బ్యాడ్జ్ బహుమతిగా ఇచ్చాడు. అనంతరం రోహిత్ శర్మ మాట్లాడుతూ.. 'ఇది అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన అని నేను అనుకున్నాను. ఇలాంటి ప్రదర్శన మొదటి ఆట నుండి మేమంతా ప్రయత్నిస్తున్నాము. వ్యక్తిగత ప్రదర్శనలు పరిగణనలోకి తీసుకోవద్దని సమిష్టిగా రాణిస్తే భారీ స్కోరు సాధ్యమేనన్నాడు. మనం అలాంటి లక్ష్యాన్ని సాధించగలమని ఈ విజయంది చూపిస్తుంది. మనం చాలా రోజులుగా మాట్లాడుకుంటుంది దీని గురించే కదా.. ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందిస్తే లక్ష్యాన్ని చేరుకోగలం బ్యాటింగ్ కోచ్, కెప్టెన్ మన నుంచి ఆశిస్తున్నది ఇదే.' అని రోహిత్ శర్మ అన్నాడు. కాగా.. రోహిత్ శర్మ మాట్లాడిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## రెండేళ్ల తర్వాత జట్టులోకి సోఫీ మోలినెక్స్

క్రికెట్ ఆస్ట్రేలియా 2024-25 సీజన్ కోసం మహిళల క్రికెట్ జట్టు సెంట్రల్ కాంట్రాక్ట్‌ను ప్రకటించింది. సోఫీ మోలినెక్స్ రెండు సంవత్సరాల తర్వాత సెంట్రల్ కాంట్రాక్ట్‌కి తిరిగి వచ్చింది. గత కొన్ని సిరీస్‌లలో మోలినెక్స్ ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఇటీవల ముగిసిన బంగ్లాదేశ్ పర్యటనలో కూడా, ఈ స్టార్ ఆల్ రౌండర్ అద్భుతమైన ఆట ఆడి ప్రశంసలు అందుకుంది. రెండేళ్ల తర్వాత సోఫీ మోలినక్స్ క్రికెట్ ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్‌కు తిరిగి వచ్చింది. బంగ్లాదేశ్‌తో జరిగిన టీ-20 సిరీస్‌లో మోలినెక్స్ అద్భుతంగా ప్రదర్శన చేసింది. ఈ సిరీస్‌లో ఆరు వికెట్లు పడగొట్టిన కంగారూ స్టార్ ప్లేయర్.. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా కూడా ఎంపికైంది. ఆమె.. వన్డే పునరాగమనంలో కూడా.. తన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. బంగ్లాదేశ్‌పై కేవలం 10 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టింది. మరోవైపు.. 2024-25 మహిళల జట్టు సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మెగ్ లానింగ్ పేరు లేదు. వాస్తవానికి.. లానింగ్ గత ఏడాది నవంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. ఈ క్రమంలో.. కేంద్ర కాంట్రాక్టులో లానింగ్‌కు చోటు దక్కకపోవడానికి ఇదే కారణం అని చెప్పొచ్చు.

## ఐపీఎల్ నుంచి తప్పుకున్న వనిందు హసరంగా

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2024) 23వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు స్టార్ ఆల్ రౌండర్ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. ఈ ఐపీఎల్ వేలం ద్వారా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ వనిందు హసరంగను రూ.1.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు అతను ఔట్ కావడంతో సన్‌రైజర్స్ జట్టు మరో విదేశీ ఆటగాడిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.ఈసారి ఐపీఎల్ 2024)లో అద్భుత ప్రదర్శన చేస్తున్న సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు షాక్ తగిలింది. ఐపీఎల్ సీజన్ 17 నుంచి ఆ జట్టు అగ్రశ్రేణి ఆల్‌రౌండర్ వనిందు హసరంగా నిష్క్రమించాడు. %జ% ఈ ఐపీఎల్ వేలం ద్వారా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ వనిందు హసరంగను రూ.1.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు అతను ఔట్ కావడంతో సన్‌రైజర్స్ జట్టు మరో విదేశీ ఆటగాడిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇప్పటివరకు 4 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 2 మ్యాచ్‌లు గెలిచింది. సన్‌రైజర్స్ ఓడిపోయిన రెండు మ్యాచ్‌ల్లోనూ మంచి ప్రదర్శన చేసింది. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో కొనసాగుతోంది. తమ తదుపరి మ్యాచ్‌ని ఏప్రిల్ 9న ఆడనుంది. మహారాజా యద్వీంద్ర సింగ్ స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.




## ఒకే ఓవర్‌తో మణిమారన్ సిద్ధార్థ్ ఐపీఎల్‌లో చెత్త రికార్డ్




ఆదివారం గుజరాత్, లక్నో ( జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ నేతృత్వంలోని లక్నో జట్టు 33 పరుగుల తేడాతో సులువైన విజయాన్ని నమోదు చేసింది. దీంతో లీగ్‌లో హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. దీనికి ప్రతిగా గుజరాత్ కేవలం 130 పరుగులకే ఆలౌటైంది. లక్నో విజయంలో జట్టు బౌలింగ్ విభాగం సహకారం ఎంతో ఉంది. లక్నో పేసర్లు ఆరంభం నుంచే గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ముఖ్యంగా 5 వికెట్లు తీసిన యశ్ ఠాకూర్ విజేతగా నిలిచాడు. అయితే, లక్నో స్పిన్నర్ మణిమారన్ సిద్ధార్థ్ ఒకే ఓవర్‌లో మూడు నో బాల్‌లు వేసి అవాంఛిత రికార్డు సృష్టించాడు. లక్నో తరపున ఇంపాక్ట్ ప్లేయర్‌గా నిలిచిన మణిమారన్ సిద్ధార్థ్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 29 పరుగులు ఇచ్చాడు. పవర్‌ప్లేలో తొలి రెండు ఓవర్లలో ఎక్కువ పరుగులు ఇవ్వని సిద్ధార్థ్ మూడో ఓవర్‌లో కాస్త కాస్ట్లీగా మారాడు. ఈ ఓవర్‌లో 12 పరుగులిచ్చి మూడు నో బాల్‌లు వేశాడు. దీంతో ఐపీఎల్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక నో బాల్‌లు వేసిన స్పిన్నర్‌గా నిలిచాడు. ఈ విషయంలో సిద్ధార్థ్, అమిత్ మిశ్రా, అనిల్ కుంబ్లే, యోగేష్ నగర్‌లను అధిగమించాడు. ఒకవైపు మణిమారన్ సిద్ధార్థ ఒకే ఓవర్‌లో మూడు నో బాల్‌లు వేసి అవాంఛిత రికార్డును తన ఖాతాలో వేసుకోగా, మరోవైపు స్పీడ్‌స్టర్ యశ్ ఠాకూర్ 5 వికెట్ల హాల్‌తో ఆకట్టుకున్నాడు. 3.5 ఓవర్లలో 30 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు. ప్రస్తుత సీజన్‌లో ఓ బౌలర్ ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి.ఈ విజయంతో లక్నో సూపర్‌జెయింట్స్ ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకగా, గుజరాత్ టైటాన్స్ జట్టు ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, మూడు ఓటములతో నాలుగు పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. లక్నో సీజన్‌ను శుభారంభం చేసింది. నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలిచి ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com